సృజన

ఆధునిక సాహిత్య వేదిక

ఉరిపాట

శివసాగర్



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

33

జూన్ 1972

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

---

72 పేజీలు 1 రూపాయి

ముఖచిత్రం :
జార్జి రెడ్డి
(చూ. పేజీ 43–45)

ప్రతులకు, వివరాలకు:
సృజన
హనుమకొండ,
వరంగల్–1 (ఆం.ప్ర.)

విడిప్రతి: ఒక రూపాయి
అర్ధసంవత్సర చందా: ఆరు రూపాయలు
సంవత్సర చందా: పది రూపాయలు

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyderabad. Wide Re. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayamu,
J. P. N. Road, Waranagal-2 (A.P.)

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక 33

1972 జూన్

'పుస్తకాల దొంగలు'

విప్లవ రచయితల సంఘ సభ్యుల ఇండ్లపై మళ్ళీ పోలీసులు అర్ధరాత్రి సమయంలో దాడిచేసి సెర్చ్‌వారంటయినా లేకుండా కట్టెకు కనిపించిన ప్రతి పుస్తకాన్ని, ఎర్రగా కనిపించిన ప్రతి అక్షరాన్ని, వ్యక్తిగత ఉత్తరాలను కూడ స్వాధీనం చేసుకున్నారు. (విప్లవ రచయితల సంఘంలోని ఒక సభ్యునికి బావమరిది అవుతాడన్న నేరంమీద ఒక వ్యక్తిని అరెస్ట్‌చేసి— పోలీసుల బావమరదులో, తమ్ములో, కొడుకులో నక్సలైట్లుకూడ కావచ్చుకదా అని అనుమానం వేసిందేమో వదిలేశారు!) నక్సలైట్లతో సంబంధాలున్నాయన్న అనుమానంమీద జంట నగరాలలో చాలమంది యిండ్లపై మెరుపుదాడి(!) చేసి రచయితల విషయంలో తమ న్యాయస్థానాలు చెప్తున్నమాటలే తాము పాటించలేక పుస్తకాల దొంగతనాని కెగబడ్డారు.

పోలీసులకన్న బందిపోటు దొంగలు, జేబులు కత్తిరించేవాళ్ళు చాల వివేకశాలురనిపిస్తున్నారు. వాళ్ళుబలీయమైన అవసరాలకోసం ఆహారపదార్థాలో, డబ్బో దొంగిలిస్తున్నారు వాళ్ళు. ఆపని పోలీసులంత సిగ్గులేకుండా, చట్టబద్ధంగా, యూనిఫా(ర)మ్‌లో వచ్చికూడ చేయడంలేదు. తమ అవసరమేదో తామెందుకు దొంగతనానికి తప్పనిసరియై దిగాల్సి వచ్చిందో, అదితప్ప గత్యంతరంలేని సామాజిక స్థితిగతులు ఏమిటో వాళ్ళకు స్పష్టంగా తెలుసు. పోలీసులు— పుస్తకంమీది పేరయినా చక్కగా చదువలేరుకాని విప్లవ రచయితల సంఘం సభ్యుల యింట్లోదొరికే ఏ పుస్తకమైనా ప్రమాదకరమయిందే, ఎర్రని అక్షరాలే— వీళ్ళకేదో పెద్దకుట్రవలె కనిపిస్తాయి.

వీళ్ళకు కర్ర తప్ప కన్నులేదు. వేషం తప్ప వివేచనలేదు. తుపాకీ తప్ప హృదయంలేదు. అందుకే ఏస్థాయినుంచి వచ్చిన వాళ్ళయినా వీళ్లంతా దోపిడీ వ్యవస్థకు కళ్ళుగా చెవులుగా చక్కగా ఉపయోగపడుతున్నారు.

కుటుంబరావుగారు ఒకచోట చమత్కరించినట్లు పోలీసును రక్షకభటుడు అని పిలవమంటే ప్రజలు అందుకే చచ్చినా ఒప్పుకోరు.

—సంపాదకుడు

ఉరి పాట

— శివసాగర్

ఉరికంబం
మీదనిలిచి
ఊహాగానం
చేసెద.

నా ఊహాల
ఉయ్యాలలోన
మరోజగతి
వూసులాడు

ఉరికంబం
మీదనిలిచి
తియ్యనికలలే
కందును.

నా తియ్యని
కలలేనిజమై
నిఖిలలోకమే
హసించు.

రెక్కవిప్పి
ఎర్రినేన
నలుదిక్కుల
ప్రసరించును.

మొక్కవోని
ఎర్రినేన
విముక్తిని
సాధించును.

భూతాలకు
ప్రేతాలకు
గోరీలే
కట్టును.

ఉరికంబం
మీదనిలిచి
మరోజగతి
వీక్షింతును.

దానవతా
లోకంపై
కాలం
తెరదించును.

మానవతా
హిమగిరిపై
ఎర్రజెండ
ఎగురును.

విప్లవ
పెనుజ్వాలల్లో
మహామనీషి
లేచును.

కల్హారి
ఎడారిలో
కలువపూలు
పూచును.

ఉరికంబం
మీదనిలిచి
ఉజ్వలగీతిక
పాడెద.

వధ్యశిలపై
శిరసువుంచి
విశ్వవిపంచిని
మీటెద.

సప్త సముద్రాల్
ఒక్కటిగా
విశ్వగీతి
వినిపించును.

సుత్తి
కొడవలి సఖ్యం
వెలుగుబాట
చూపించును.

సూర్యుని
అరచేతపట్టి
రైతు
దుక్కిదున్నును.

ఫ్యాక్టరీలో
చందమామ
మరచక్రం
తిప్పును.

బిగిపిడికిలి
కార్మికుడే
నవజగతికి
కర్ణధారి!

మహితాత్ముడు
కార్మికుడే
నక్షత్ర
కిరీటధారి!

ఉరికంబం
మీదనిలిచి
ఊహాగానము
చేసెద.

నాఊహల
ఉయ్యాలలోన
మరోజగతి
పూసులాడు.

మిత్రులారా!
నాకోసం
కనులనీరు
నించకండి!

పోరాటం
మరవకండి!
ఎర్రజెండ
విడువకండి!

చేతిలోని
బందూక్‌ను
భద్రంగా
నిలుపుకోండి!

నారక్తం
వృధాకాదు
నా మృత్యువు
వృధాకాదు.

నా నెత్తురు
కోనేరులో
నవలోకం
వికసించును.

నామృత్యువు
సన్నిధిలో
జీవరవళి
వినిపించును.

ఉరికంబం
మీదనిలిచి
విప్లవనాదం చేసెద.
విజయవినాదం చేసెద.

మృత్యు
ముఖాన నిలిచి
జీవనగీతిక పాడెద!
నవజీవనగీతిక పాడెద!

... ...

... ...

వీడ్కోలు! వీడ్కోలు!

వీడ్కోలు ఉరికొయ్యకు

ఉరితాళ్ళకు వీడ్కోలు!

జైలుగోడ! వీడ్కోలు!

పాముపడగ! వీడ్కోలు!

... ...

... ...

వీడ్కోలు... ... ...వీ!

... ... డ్కో!...

... ... లు!

వీ!... ... ...

'...సబ్ కానావ్ వియత్నావ్'

— టి. కోటయ్య

వియత్నాం పౌరులు
ధ్వంసిస్తున్న అమెరికా మోర్టారులు
గుండెలు పిండయ్యే
ప్రపంచం అరుపులు
ఉసిగొల్పిన జాగిలం
అమెరికా ధనస్వామ్యం
చిట్లుతున్న చిట్టడవి
చీమల్లా చుట్టుముట్టే
వియత్నాం జనశక్తి
వెల్తురుగుహ.
వియత్నాం చిత్తడినేల
రక్తం! రక్తం!! రక్తం!!
చుట్టూ నా చుట్టూ ప్రపంచం చుట్టూ
వియత్నాం, వియత్నాం, వియత్నాం
మాలో నీలో అణగారిన అందరిలో వియత్నాం
అమర వీరుల ఆశయాల్లోంచి
విప్లవ వినాదాలు
ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్
నీ వయస్సెంత
గుయెన్ వాన్‌దాట్.
జిందాబాద్ ఇన్లిలాబ్
రేపే సూర్యోదయం
కామ్రేడ్ అదే తూర్పు
ఆగకు, ఆగకు, ఆగకు.

* * *

అమెరికాలో హిప్పీబాంబు
అమెరికాలో ఆర్థిక దివాలా
అమెరికాలో సెనెటర్స్ అసంతృప్తి
అమెరికాలో యువకుల తిరుగుబాటు
ప్రపంచానికి గుణపాఠం
యువతరానికి
నవతరానికి మేలుకొల్పు

*　　*　　*

రేవులన్నీ బంధించు
నా తల కొరివినేనే పెట్టుకుంటా
జీవులన్నిట్నీ హింసించు
నా తరాన్ని నేనే నరుక్కుంటా
ఇది అసలైన పెట్టుబడిదారీ
సిసలైన ప్రజాస్వామ్యం!

*　　*　　*

గెరిల్లాలు అలలు
వియత్నాంలో లేచిన కెరటం
లావోస్, కాంబోడియా కెరటాలను తట్టి లేపి
సామ్రాజ్యవాదం చాపకిందికి నీళ్ళు తెస్తుంది
నీళ్ళు, నీళ్ళు, నీళ్ళు,
పెట్రోల్, పెట్రోల్, పెట్రోల్
పెంటగన్‌లు, గన్‌లు ఫెటిల్లున పేలిపోతాయి
వియత్నాం, వియత్నాంనే కాదు
అమెరికా విద్యాలయాలనుకూడా విముక్తి చేస్తుంది.
ఆసియా దేశాలను
అణగారిన అన్ని దేశాలను
విముక్తం చేస్తుంది,

*　　*　　*

'అప్‌నా బరీ, తుమారా బరీ
సబ్‌కాబరీ నక్సల్‌బరీ
అప్‌నా నామ్ తుమారా నామ్
సబ్‌కా నామ్ వియత్నామ్.'

వస్తున్నాం!

- ఇస్క్రా

వస్తున్నాం ఖబర్దార్ !
పదునెక్కి వస్తున్నాం
పగబట్టి కదులు తున్నాం
పగబట్టి, పదునెక్కి వస్తున్నాం !

కడుపెండిన కొడవళ్ళం
నడుమిరిగిన నాగళ్ళం
సుత్తీ కొడవళ్ళం, గొడ్డలి రంపాలం
చెమటోడ్చే శ్రామికులం
సాయుధ కార్మికులం
భయం దులిపి, పిడికిలెత్తి

వస్తున్నాం ఖబర్దార్ !
పదునెక్కి వస్తున్నాం !
పగబట్టి కదులు తున్నాం !

తరతరాల దోపిడీకి
నరనరాన పగ రగిలి
పల్లె పల్లె ప్రతి పల్లె
చెలరేగిన 'అలగా జనం'
గెరిల్లాలం, గెరిల్లాలం, గెరిల్లాలం-
గురి పెట్టిన మర తుపాకులం
తూర్పు దిక్కు తొలిసంజె- ఎర్రసేన

వస్తున్నాం ఖబర్దార్ !
పగబట్టి, పదునెక్కి వస్తున్నాం !
సత్యాన్ని హత్యచేస్తే
శ్రీకాకుళం చస్తుందా ?
కర్మార్‌ని కాల్చేస్తే

నక్సల్‌బరీ ఆగుతుందా?
నిర్మల చిన బాబులు, గణపతి భాస్కరులు
సలసల కాగే నెత్తురుతో వేలకు వేలు
"అరచేతిని అడ్డుపెట్టి
సూర్యకాంతి నాపలేవు!" ఖబర్దార్!
వస్తున్నాం! పగబట్టి
పగబట్టి వస్తున్నాం!
ఛీర్బుమ్ పెళ, పెళ ఉరుముతోంది
బీహారు నిప్పులు కురుస్తోంది
కిరాయి మూకల గుండెలు పగిలే
మహా ప్రళయం- ప్రజాయుద్ధం-
సుదీర్ఘ సాయుధ పోరాటం.
మా మరణం- వీరమరణం- అమరం!
విముక్తికొక సోపానం- మహోన్నతం!
ఖబర్దార్- ఖబర్దార్!
పగ బట్టి వస్తున్నాం!
పడునెక్కి వస్తున్నాం!
వియత్కాంగుకు భుజం కలిపి
కాంబోడియాకు కదం కలిపి
ఎర్రిచైనా అడుగులలో, వరవడిలో
కదం కదం- పదం కలిపి
కదనుతొక్కి, అదనుచూసి
నీ గుండెల్లో కలుక్కు మంటాం
నీ దుండగానికి సమాధి కడతాం!
వస్తున్నాం ఖబర్దార్!
పడునెక్కి వస్తున్నాం!
పగబట్టి కదులు తున్నాం!

ప్రజా సైన్యం

ఎక్స్ - రే

దేశమంతటా అడవులున్నాయి
అవే మన కోటలు
చిక్కటి కొండలున్నాయి
అవే మన దుర్గాలు
నదులూ సముద్రాలూ వున్నాయి
అవే మన ఆయుధాలు
వాన వచ్చినా వరద వచ్చినా అది
మన శత్రువుకు ఉరితాడవుతున్నది
పగలు
మన శత్రువు శిరస్సున నిప్పులు కురుస్తున్నాయి
రాత్రి
మన శత్రువు గుండెలో
భయాలు కన్నున దిగుతున్నాయి
కూడదీసుకో
గెరిల్లా నీ ప్రకృతి సేనని
తుపాకులతో మాటాడించు
హేండ్ గ్రనేడ్‌లతో
రాయబారాలుచేయి
ఎర్రబావుటా కాగడా కనిపిస్తున్నది
కీళ్ళు సడలిన వాళ్ళు కూడా
కదిలి వస్తున్నారు పద.

[71 నవంబర్ (26) సంచికలో ఎక్స్-రే పేరుతో ప్రచురించబడిన రెండు కవితలుకూడ ఎక్స్-రే వి కావు.

'బావుటాలు పంచిపెట్టు' రచయిత బి. శశి
'సాహసానికి సహస్ర హస్తాల్' రచయిత సూర్యనారాయణ

ఈ పొరపాటుకు చింతిస్తున్నాం.

— సంపాదకుడు.]

నూతన అతివాదం

— ఎ. ఆర్.

ఇది నూతన అతివాదం
అఖండ విప్లవవాదం
సమతా మానవతా వాదం
ఇది నూతన అతివాదం
అనంత విప్లవ వాదం.

ప్రతిపక్షం అధికారం
చెట్టా పట్టాలేసుకు
ప్రజలను దోచేస్తూంటే
కోపంతో ఉడుకెత్తిన
యువ రక్త మహానినాదం
ఇది నూతన అతివాదం
సమతా మానవతా వాదం.

సోషలిస్టు కమ్యూనిస్టు
మహదాశయ ఆదర్శాలతో
త్యాగశీలురై దూరదృష్టితో
ఒకనాడోహో అనిపించుకున్నవారు
ముదితత్వం పైబడగా
అలసిన కన్నులతో
అసంతృప్త దృక్కులతో
శిథిల సమాజచట్రంలో
తామూ బందీలై
సందేశం విస్మరించ,
అతివాదం, ధనికవాదం
షాడోఫైట్ చేస్తూంటే
బేలట్ పేపర్ల యుద్ధ
దీపావళి తుపాకీల

వినోదాన మునిగుంటే
కనువిప్పిన నవలోకం
మహోన్నతాదర్శాలతో
చివురించే యువలోకం
చేబట్టిన వాదం
సాయుధ విప్లవ వాదం
తక్షణ ఆయుధ వాదం
సామ్యవాద రణన్నినాదం
ఇది నూతన అతివాదం
అఖండ అనంత విప్లవవాదం
సమతా మానవతావాదం.

ఇది నూతన అతివాదం
ఇప్పటి విప్లవవాదం
తిష్ట వేసుక్కూచున్న
రకరకాల వ్యవస్థల
అన్నిటినీ తిరస్కరించే
కూలదోసే వాదం
సమతా స్వేచ్ఛా
మానవతా వాదం.

ఇది నూతన అతివాదం
మానవ సమిష్టి వాదం
దేశమనే పేరుతో, భక్తితో
మతమనే జాతియనే ప్రాంతమనే
సిద్ధాంతం, పార్టీయను
వేరు వేరు మారు మారు వేషాల్లో
ప్రపంచం మొత్తంలో ప్రజలందరనూ
దోపిడి చేసుక బతికే
మోసంచేస్తూ నడిచే
పెట్టుబడిదారులనూ
అధికార పెత్తందారులనూ

అట్టడుగుకు తోసేసే,
మనిషి మనిషిగా
సుహృద్భావంతో
సద్బంధంతో
సహోదరత్వంతో
సమానులుగా
విశ్వజనీనులుగా
జీవించేందుకు పయనించే
నూతన అతివాదం
స్వేచ్ఛాప్రియ సమిష్టి
మానవతా వాదం

తన జాతిలోని పేదల, నల్లవాళ్ళ
పరజాతుల ప్రజల
దోచుకుతినే పెట్టుబడిదారీ
వర్గ ప్రతినిధి నిక్సన్,
భయంతో స్వేచ్ఛారాహిత్యంలో
ప్రజలను ముంచి
ఇతర దేశాల ప్రజలను
రివిజనిస్టు మతమౌఢ్యంతో మోసగించి
తన, తనలాంటివాళ్ళ
అధికార కులీనుల
సౌఖ్యం స్థిరత్వం రాజ్యం
నడుపుకొనే బ్రెజ్నేవ్, కొసిగిన్
తుచ్ఛ భౌతిక సుఖాల
లోలత్వం ప్రజలకు నేర్పి
తన పెత్తనం ఆధిక్యం
కలకాలం సాగించజూచే
రకరకాల లీషవోచీలు
నాయకాధికారులందరూ
మా శత్రువులు.
ఈ వీళ్ళందరూ పోషిస్తున్న

వీళ్ళను నిలబెడుతున్న
యీ నానా వ్యవస్థలు
యీ వ్యవస్థల మూలస్థంభాలయిన
అజ్ఞానం, దౌర్జన్యం
మోసం, ఆయుధబలం
మతసిద్ధాంత రాజకీయ మౌఢ్యం
మేం ముట్టడించే శత్రు దుర్గాలు.

నక్సలైట్లు, రెడ్‌గార్డులు, గువెరా, తోహోలు
'మే' విప్లవ ఫ్రెంచ్ యువకులు
బ్లాక్ పాంథర్, పాలస్టైన్ గెరిల్లాలు
కాన్ బెన్డిట్ రూడి డచ్కేలు
మా నాయక శిఖా మణులు.

ఇది నూతన అతివాదం
సమతా మానవతావాదం.

నల్లని సత్యం

యుగ

ఎర్రగా కాలిన మబ్బు ఫక్కున పగిలింది
చీకటి చిమ్మింది
కొత్తరాగం మొదలయింది
మెత్తనిపరుపులు పరవశమొందాయి
సీసాలు ఖాళీఅయ్యాయి
చీరలు ముడతలుపడ్డాయి
నీతి న్యాయం ధర్మం చట్టం
సోయిలేకుండా నిద్రోతున్నాయి
అలాంటిపదాలను భాషనుంచె

తప్పిస్తే పోయేదిగా ఉంది
పత్రిభుత్వం మనది
ఏమయినా చెయ్యొచ్చు
నోరుమనది నాణెం మనది ఏమయినా తినొచ్చు
అహంమనది అధికారంమనది
ఎవత్తినయినా చెరచొచ్చు
చీకటిపవరు తగ్గకముందె చెయ్యాలి
ప్రయోగాలుచేసి పవరును పెంచాలి
చివరికి చీకటినే ఖాయంచెయ్యాలి
అందరమూ తలొకచెయ్యి వెయ్యాలి
యాభైకోట్ల గొంతుకల తడి ఆరాలి
ఎదురుతిరిగిన పత్రివాడికి
ఒక గొయ్యి తవ్వించాలి
అందులోనె మొలకగానె మగ్గిపోవాలి
ఆగొయ్యి చూపించు
పత్రివాడి నాలుక తీసి నీ బేగ్‌లో పెట్టుకో
కొన్నిమాత్రం మరవద్దు
జనగణకు లేచి నిలబడ్డం
అంతరాత్మకు వ్యతిరేకంగా మాట్లాడ్డం
కాలుజారేవాణ్ణి
పూర్తిగా జారిపడనిచ్చి సానుభూతి చూపడం
సిగరెట్టు వెలగ్గానె అగ్గిపుల్ల పక్కవాడింటిమీద
వెయ్యడం
లాంటివి.
ఎవడయినా మాట వినకపోతే
ఇనుప టోపీ చూపించు
తోలుతుపాకి చూపించు
నారిని చూపించు నాణాన్ని చూపించు
బ్లూఫిలిం చూపించు
చెయ్యిజారితె బొందలగడ్డ చూపించు
నక్కరానె పాటలకు

బాణీకట్టడం చాతనయితె చాలు
మళ్ళీ మబ్బు అతుక్కునెవరకూ
ఈ సలహా చాలు
నీదే రాజ్యం
చీకటి ప్రభుత్వం
కొత్త రాగం పాడు
కొత్త బాణీ కట్టు
బాణీకి బాణీకి మధ్య చెక్కలవంతెనవెయ్యి
చెక్కమీద ధర్మచక్రం జాగ్రత్త
మధ్యగీతపోతె పర్వాలేదు
కాళ్ళవెనుకపడిన వాడి చేతిలో కాసుపెట్టు
కాదన్నవాడి నెత్తిమీద కాలుపెట్టు
ఖంగారుపడకు
చీకటిబాంబు ప్రయోగశాలలో ఉంది
దానికొక పూలదండ కొనుక్కురా
ఇప్పుడే పేలుద్దాం.

దేశభక్తి

నగ్నముని

అతను నాకు తెలిసిన కుర్రాడు
మిలిట్రీలో చేరతానని పరిగెత్తాడు
మొదట తల్లీతండ్రీ నెత్తీనోరూ బాదుకున్నారు
తర్వాత్తర్వాత కొడుకు దేశభక్తికి మెచ్చుకున్నారు
అతను నాకు తెలిసిన కుర్రాడు
సాంప్రదాయాల్ని తు.చ తప్పకుండా పెరిగాడు
పెద్దల్ని నొప్పించడం ఎన్నడూ ఎరగనివాడు
రోజూ దేవాలయానికెళ్ళేవాడు
ప్రతి శనివారమూ తప్పనిసరిగా రాయిమీద టెంకాయ

బద్దలు కొట్టేవాడు, హారతి కళ్లకద్దుకునేవాడు
కష్టపడి చదివేవాడు
క్లాసులో మంచి మార్కులు తెచ్చుకునేవాడు
రామకృష్ణ పరమహంస వివేకానందుల్ని పఠించేవాడు
కుడిఎడమలు జాగ్రత్తగా చూచినడిచేవాడు
విశ్వనాథ సత్యనారాయణ్ణి పొగిడేవాడు
పెద్దలకి నమస్కరించేవాడు
ఒడుగైనవాడు
మిలిట్రీలో చేరతానని పేరిచ్చాడు
మొదట తల్లీతండ్రీ నాదగ్గరకొచ్చి నెత్తీనోరూబాదుకున్నారు
వాడిమీద ఆశలు పెట్టుకున్నామన్నారు
అతని దేశభక్తిని లోకల్ నాయకులు హర్షించారు
అతను నాకు తెలిసిన కుర్రాడు
చిన్నప్పట్నుంచీ నాదగ్గర చనువుగా వుండేవాడు
అప్పుడప్పుడు నే చూపులు గుచ్చి నవ్వినప్పుడు
లో విషయాల్ని నాదగ్గర రహస్యంగా చెప్పేవాడు
నాకు ఏంచెప్పినా ఫర్వాలేదనుకునేవాడు
మిలిట్రీలో చేరి వెళ్లబోయేముందు రాత్రి
నాదగ్గరకొచ్చాడు
అవీ ఇవీ మాట్లాడాడు
రాజకీయాలూ జాగ్రఫీ మాట్లాడాడు
నేను అతని గుండెల్లో చెయ్యి పెట్టి
'నిజం చెప్పు
మీ నాయన ఉన్నవాడు
నువు చూపించే ఆకాశాల్ని కొనివ్వగలిగినవాడు
మిలిట్రీలో కెందుకెడుతున్నావ్ ?'
విలదీసినా అమాయకత్వం నటిస్తూ అడిగాను
ఎవరికీ చెప్పననే ధైర్యం చూపుల్లో ఇచ్చాను
మెరికలాంటి కుర్రవాడు
దేశభక్తి మతభక్తి వెన్నతో పెరిగినవాడు
రహస్యం చెబుతున్నట్టు చెప్పాడు

'నాకన్నీ ఉన్నాయి
మా నాయన పలుకుబడితో
నా చదువుతో మిలిట్రీలో నైనా పైపైకి పోగలను
మిలిట్రీలో చేరితే
దేశానికి సేవచెయ్యొచ్చు
మంచి తిండీ మెరిసే యూనిఫారమ్‌లో తిరగొచ్చు
మెడల్సు సంపాదించొచ్చు
ఇతర ప్రాంతాలు చూడొచ్చు
అన్నిటికన్నా ముఖ్యం
అన్నిటికీ లైసెన్సు పొందొచ్చు
ఫారిన్‌లిక్కర్‌తో ముఖం కడుక్కోవచ్చు
గ్రామాలమీదపడి ఇళ్లు తగులబెట్టొచ్చు
ఇష్టంవచ్చినట్టు పిట్టలకిమల్లే మనుషుల్ని కాల్చిపారెయ్యొచ్చు
చేతికందిన ఆడవాళ్లని చెరిచి మరీ అనుభవించొచ్చు'.

పేదవాళ్లు పేదవాళ్లుగా ఉండడంవల్లనే
గొప్పవాళ్లు గొప్పవాళ్లుగా ఉన్నారు

అనువాదం: శ్రీ శ్రీ

"ప్రభూ! ఎప్పుడు నువ్వు సుఖంగా ఉండడం చూశాం....?"
మత్తయి సువార్త 25 : 37

నేను ఆకలితో ఉన్నాను
నువ్వు చంద్రుడివద్దకు వెళ్లావు
నన్ను పీడిస్తున్నారు
నువ్వు ఓపిక బోధిస్తున్నావు
నాకో ఆశ్రయం లేదు
నువ్వు విచారణ సంఘాన్ని నియమించావు
నేను తిండిలేక నీరసిస్తున్నాను.

నాకు వాగ్దానాలు మేపుతున్నావు
నాకు చదువు లేదు
నువ్వు "అయ్యోపాపం, అలాగా?
కూడదు, కూడ"దన్నావు
నాకు కట్టగుడ్డ లేదు
నువ్వు నాపాం బాంబుల బిల్లులు చెల్లిస్తున్నావు
నేను నిరుద్యోగినయినాను
"ఆపనులిప్పుడు యంత్రాలు చేసేస్తున్నా"యన్నావు
నేను జబ్బుపడి పోయాను
శాంతి భద్రతలు నీ మొదటి సమస్య అన్నావు
నేను దరిద్రుణ్నయాను
దరిద్ర్యం ఈనాటిది కాదన్నావు
సాయం చెయ్యమన్నాను
"దేవుడు చేస్తాడులే" అన్నావు
నాకు కోపం వచ్చింది
కారణం కమ్యూనిస్టులమీదికి నెట్టావు
నాకు ఆకలి వేసింది
"రేపు మరోమారు ప్రయత్నించు" అన్నావు.

కుట్ర

రుద్రజ్వాల

ఈ చౌకధాన్యం డిపోలు
నీ ఆకలి బతుకు బాగుచేయడానిక్కాదు.
అక్కడక్కడా
వాళ్లవాళ్ల చీకటి గోడౌన్లు
దొంగలాభాల రవాణాలు
బద్దలుకొట్టి- దోచేస్తున్న
నీ తిరుగుబాటు తత్వాన్ని

నీరుగార్చేందుకు-
నీ సుఖసంతోషాలకు
రక్తమోడుస్తున్నవారి పోరాటమార్గం నుండి
నిన్ను తప్పించేందుకు
తెరచిన కుతంత్రం.

ఈ స్వల్పవడ్డీఋణాలు- బంజర్ల పట్టాలు
నీ జీవితాన్నుద్ధరించడానిక్కాదు,
శ్రామిక సమతారాజ్య స్థాపనకు
శ్రీకాకుళంలో- చిత్తూరులో- నెల్లూరులో
అక్కడక్కడా
వాళ్ల దోపిడి కూటాలమీద
నీవాళ్లెత్తిన కత్తినీ- గండ్రగొడ్డలినీ
ఈటెనీ- బరిశనీ
అందుకొనే నీ చేతులకు
వేస్తున్న ఉచ్చుల పన్నాగం.

సమష్టినుండి
తాత్కాలిక వ్యష్టిప్రయోజనానికి నిన్ను దిగజార్చి,
సమైక్యతను చీలదీసి,
నిన్నూ, నీవాళ్ల నొక్కొక్కళ్లనూ
కాలరాచే దొంగ సామ్రాజ్యవాదుల స్వార్థం.
తరతరాల స్వేదాశ్రువుల ఫలితాన్ని
కొల్లగొట్టే తన జాతి పందికొక్కుల్ని
తుపాకుల్తో కాపాలా కాస్తూ;
ముష్టిగింజల బేరానికి
బంజరు పొలం ధర్మానికి
రూపాయల యాచకానికి
నిన్ను బందీనిచేసే కుట్ర.

రాయిరప్పకు సెప్పనా

చెరబండరాజు

కూలికోసం తాను
ఎదురు తిరిగితేను
నక్సలైటూవని
సంపేసి పోనారు

రాయిరప్పకు సెప్పనా-నాగోడు
నేనె రాయై పోదునా

సదువుకుంటే బతుకు
బాగవుతదంటారు
బడికెల్లితే కొడుకు
కూడెవడు పెడతాడు. ।రాయి॥

ఇంటిల్లిపాదిమీ
రెక్కలిరుచూకున్న
ఏ పూట కాపూట
గంజి కరువేనాయె ॥రాయి॥

అప్పు ముప్పంటారు
తప్పు తప్పంటారు
అప్పుసేయకపోతె
పొద్దు పొడవాదాయె ॥రాయి॥

వానకాలంవస్తె
ఇల్లు చెరువైపాయె
కప్పలూ పాములూ
మా పక్కలోనాయె ॥రాయి॥

పెద్ద మనిషైబిడ్డ
ఇంట్ల ఉన్నాదంటె
ఊరి పెద్దా చీర
రైకలిస్తాననే ॥రాయి॥

చెరువులో దూకనా
చెరువయ్యి పోదునా
ఉరిపోసు కుందునా
ఉరితాడు అవుదునా ॥రాయి॥

"విప్లవ వాస్తవికత" అంటే ఏమిటి?

నిఖిల్

ఇటీవల కొడవటిగంటి కుటుంబరావు గారిని కలుసుకోడం తటస్థించినపుడు "సాహిత్యంలో- కళల్లో సోషలిస్టు వాస్తవికత" గురించి ప్రస్తావన వచ్చింది. ఆయన వెంటనే "విప్లవ వాస్తవికత" అనే కొత్త సూత్రాన్ని ప్రతిపాదించారు. ఆ తర్వాత మే '72 "సృజన"లో ఆ అంశం గురించి తమ అవగాహనను వ్యక్తం చేశారు.

ఈ "విప్లవ వాస్తవికత" గురించి నాకువున్న అవగాహనను మిత్రులతో పంచుకోవాలనే కోరికతోనే చర్చకు ఉపక్రమిస్తున్నాను.

గడచిన వంద సంవత్సరాలలో ప్రపంచ సాహిత్యంలో "వాస్తవికత" అనేది నిర్వివాద అంశం. అక్టోబర్ విప్లవం వచ్చేముందు ఈ వాస్తవికత క్రమంగా సామాజిక వాస్తవికతగా రూపొందింది. ఆనాటి శ్రామిక పోరాటాలలో ఎదురైన వాస్తవాలను రచయిత దూరంగా వుండి మూడోవ్యక్తిగా కాకుండా స్వయంగా తాను అనుభవించి ఆనాటి సంఘటనలకు అభివ్యక్తి కల్పించాడు. సామాజిక నిబద్ధత అనే గాఢమైన బాధ్యతతో రచయితను "సోషలిస్టు వాస్తవికత" వైపు మళ్లించాడు ఆ తర్వాత గోర్కీ.

సాహిత్యం - కళలు సమకాలీన సామాజిక సంఘటనలను యథార్థంగా అద్దం చూపినట్టు మాత్రమే చూపితే ప్రయోజనం లేదని, రచయిత తన బాహ్యలోకంలోని వాస్తవాలను తన అంతర్‌లోకాలలోని ఆలోచనలతో- ఆశలతో సమన్వయం చేయాలని సామాజిక వాస్తవవాదులు వ్యాఖ్యానించారు. రచయిత లేదా కళాకారుడు తన సృజనాత్మకమైన ప్రయోగశాలలో యథార్థజీవిత దృశ్యాల విశ్లేషణతో రాబోయే కొత్త ప్రపంచాన్ని చూపగలగాలి అనే ఆశావాదాన్ని వెలిబుచ్చారు.

అదే క్రమంగా చరిత్రను మార్చిన మార్క్సు రచనలు మనిషిని కొత్త మలుపులోంచి విశ్వాసంతో ముందుకు తీసుకవెళ్లాయి. అప్పుడే సాహిత్యంలో - కళల్లో "చారిత్రక ఆశావాదం" అనేది మహోన్నతమైన భావంగా ప్రాదుర్భవించింది. ఈ చారిత్రక ఆశావాదమే రచయితలను కేవల స్వీయ మానసిక ధోరణులతో కాకుండా ఆయా సామాజిక - చారిత్రక పరిణామాల కనుగుణంగా యథార్థ దృక్పథంతో రచయితలు చేయించింది. చరిత్ర వ్యాఖ్యానం కాకుండా చరిత్రను మార్చే నిర్ణయా

త్మకమైన రచనలను అందించింది. నూతన ప్రపంచాన్ని నిర్మించే కృషికి దోహదం చేసింది.

అనాటివరకు స్వీయ మానసిక ఆనందమే పరమావధిగావున్న సాహిత్య ఆశయం విప్లవాత్మకమైన మార్పుకు లోనైంది. కళా సౌందర్యశాస్త్ర (Aesthetics) మనే సంకుచిత పరిధిలోంచి సాహిత్యం జీవితమనే విస్తృతి రంగంలోకి అడుగుపెట్టింది. జీవిత – సామాజిక పోరాటాల నుంచి దూరంగా వుంటూ కేవలం సౌందర్యవాదంతో – ఆనందమే పరమావధి అనే రసవాదంతో విసిగిపోకుండా మానసిక రుగ్మతల నుంచి దూరమైపోయింది.

కొందరు మాజీ అభ్యుదయ + భావకవులు ఈనాడు తిరిగి "భావకళాత్మకత" అనే వొట్టి హృదయ దౌర్బల్యవాదాన్ని (లేదా అదే రసవాదాన్ని) ప్రచారం చేస్తున్నా, ఈనాటితరం ఆ రొమాంటిక్ బూజులోకి దిగడంలేదు. మానవుని మనస్సు ఇతరేతరంగా ఎంత జ్ఞానపరిపూర్ణమైనా, కవిత్వం తన సత్ఫలితాలు సాధించే ఆవరణమాత్రం వేరే వుంటుంది" అని కవిత్వానికి ఒక ఇరుకు గదిని నిర్మిస్తున్న ("చెట్టునా ఆదర్శం" అనే కవితా సంపుటికి సోమసుందర్ వ్యాఖ్యానం) మాజీ అభ్యుదయ రచయితలు ఈనాటి జీవితాన్ని – సామాజిక రాజకీయ పోరాటాలను విస్మరిస్తున్నారు. సామాజిక యధార్థాన్ని మార్క్సియన్ కళావిలువలను సవాలుచేసి సాహిత్యాన్ని కళలను వ్యక్తిగత సంకుచిత పరిధిలోకి లాగిన బ్రిటీషు కవి సిసిల్ డే లెవిస్‌కు ఈ కవులే తిరిగి ఇలా ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. "కవిత్వంలో సత్యసందర్శనం ఐంద్రియక జ్ఞాన సమైక్యత వల్లి సాధ్యమవుతుంది. ఇది తిరిగి అంతర్గతానుభవ సమైక్యతనే మేలుకొల్పుతుంది" అని అంటున్న లెవిస్ రొమాంటిక్ తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. పైగా ఈనాటి సామాజిక యధార్థాన్ని విప్లవ వాస్తవికతను అవహేళన చేస్తున్నారు.

అందువల్ల ఈనాడు విప్లవ రచయితలు "సాహిత్యం-కళల్లో విప్లవ వాస్తవికత" అనే ఈ నూతన పరిణామాన్ని సక్రమంగా అవగాహన చేసుకోవలసి వుంది. నూతన వ్యాఖ్యానలను – అనుభవాలను దీనికి జోడించవలసి వుంది. ఈ ప్రయత్నానికి నాంది పలికిన కొడవటిగంటి గారి అవగాహనను సరిగ్గా అంచనావేసుకొని "విప్లవ వాస్తవికత"కు పరిపుష్టి కల్పించవలసిన అవసరం వుంది.

కొ. కు. రావుగారు తమ వ్యాసంలో ముప్పాతికవంతు భాగాన్ని సామాజిక యధార్థాన్ని (Social realism) విపులీకరించడంలోనే ఉపయోగించుకున్నారు. ఒకనాడు రష్యాలో గోర్కి, చైనాలో లూసన్‌లు కార్మిక పోరాటాలలో పాల్గొంటూ ఈ సామా

జీక యథార్థాన్ని సోషలిస్టు యథార్థంగా రూపొందించి కూలంకషంగా చర్చించారు. ఆనాటి తమదేశాల విప్లవ పోరాటాల అనుభవాలతో 'విప్లవాత్మకమైన కళలను' ప్రతిపాదించారు. సాహిత్యంలో, కళల్లో విప్లవాంశకు ప్రాముఖ్యత నిచ్చారు. ఆనాటి పోరాట దృశ్యాలను మార్క్సియన్ అవగాహనతో చిత్రించి నూతన ప్రపంచాన్ని చూపించారు 'సోషలిస్టు వాస్తవికత' లోంచి పుట్టిన 'విప్లవ వాస్తవికతను' గుర్తించగలిగినా ప్రత్యేకించి సూత్రీకరించలేదు ఆ ప్రయత్నాన్ని ఈనాడు కొ. కు. గారు చేశారు. అయితే జీవితంలోంచి సాహిత్యం, సాహిత్యంలోంచి జీవితం ప్రయాణం చేస్తున్నప్పుడు, విప్లవ పోరాటాల్లోంచి విప్లవ సాహిత్యం విప్లవ సాహిత్యంలోంచి శ్రామిక పోరాటాలకు దారిచేస్తున్న ఈనాటి యథార్థాన్ని మనం గమనించాలి.

ఈ దేశంలో రేపటి సమసమాజ స్థాపనకై వర్గరహిత సామాజిక వ్యవస్థకై శ్రామిక పోరాటాలు ఏదోవిధంగా ప్రారంభమై కొన్ని గుణపాఠాలు సమకూర్చినాయి. అసలైన సోషలిస్టు సమాజంకోసం సాయుధపోరాటాలు చెదురుమదురుగా జరిగి "విప్లవ వాస్తవాన్ని" కళ్ల ఎదుట నిలుచోబెట్టింది. ఇప్పుడు సాహిత్యం ఈ వాస్తవాన్ని స్వీకరించింది. నిబద్ధతతో సాహిత్య రూపకల్పన చేస్తున్నది. ఈ అంశాన్ని కొ. కు. గారు తమ వ్యాసం చివరి పేరాలలో సూచించారు. కాని "మామూలు మనుషులు" అనే మెజార్టీ సామాన్యజనం పోరాటాల్లో నిర్వహించే పాత్రగురించి కొన్ని అనుమానాలకు దారితీసారు.

"మామూలు మనుషులు సూక్ష్మరూపంలో దేన్నీచూడలేరు. ఏదైనా బృహత్పరిణామంలోనే వారి ఎదట కనపడాలి. గెలిచినది ధర్మయుద్ధం, విజయవంతమైన విప్లవాలు మంచివి. అసంఖ్యాకులు, అధిక సంఖ్యాకులైన ప్రజలు జీవితంలో ప్రేక్షకుల పాత్ర మించి నిర్వహించలేరు. భవిష్యత్తును నిర్ణయించే సత్యాలపట్ల వారు అంధులనే చెప్పాలి. ఆ కారణం చేతనే విప్లవ సాహిత్యం జీవితంలోని విప్లవ వాస్తవికతను ప్రదర్శించాలి."

అయితే చారిత్రకానుభవం మరోవిధంగా వుంది. అసంఖ్యాకులైన "మామూలు మనుషులు" లేదా ఇంకా స్పష్టంగా చెప్పాలంటే రైతులు, కార్మికులు తమ వొంతు శ్రమను సమాజానికి ఇస్తున్నారు. తమ శ్రమశక్తిని దోచుకొని దోపిడి సమాజం తమపై స్వారీ చేస్తున్నదనే అంశాన్ని వాళ్లు గ్రహించాలి. ఈ గ్రహింపుకు రాజకీయ నాయకత్వం విప్లవ పార్టీలద్వారా కృషి చేస్తుంది. (ప్రజలకు నిబద్ధులైన రచయితలు తమ రచనలద్వారా ఆ కృషికి దోహదం చేస్తారు) ఆ గ్రహింపు పరిపక్వమై, రాజకీయపార్టీ నాయకత్వం సక్రమపంథాలో పోరాటాన్ని నిర్వహిస్తే ఈ అసంఖ్యాకు

లైన మామూలు జనమే అందులో ఆయుధాలతో పాల్గొని నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహిస్తారు. వాళ్ళులేకుండా ఏ విప్లవ పోరాటం విజయవంతం కాదు. బూర్జువా వర్గం నాయకత్వం వహించవచ్చు. కాని నిర్ణయాత్మకమైన పాత్రమాత్రం శ్రామిక వర్గానిదే. దీనికి ప్రత్యక్ష నిదర్శనాలు ఫ్రాన్స్‌లో చెలరేగిన ప్యారిస్ కమ్యూన్, రష్యా - చైనాలలో చారిత్రాత్మకమైన నూతన యుగాలను నిర్మించిన రైతాంగ- కార్మిక శక్తుల సంయుక్త పోరాటాలు. అందువల్ల 'మామూలు మనుషులు' ప్రేక్షకుల పాత్రను మించి నిర్వహించలేరు అని అనడం సబబుకాదనుకుంటాను. అదేవిధంగా భవిష్యత్తును నిర్ణయించే సత్యాలపట్ల వారు 'అంధులు' అని Catagorical గా చెప్పలేము. వాళ్ళకళ్లు తెరిపించి, పోరాటాలలో భాగస్వాములుగా చేయడం నిజమైన విప్లవపార్టీ లక్షణం. కాని ఈనాటివరకు భారతదేశంలో ఈ విప్లవపార్టీ బాధ్యతను స్వీకరించి కొంతదూరం వెళ్ళి, ప్రయోగాలుచేసి, చీలికలు తెచ్చుకొని, మళ్ళీ ఆయత్తమై వెనక్కి కొట్టివేయబడిన కమ్యూనిస్టుపార్టీ (పార్టీ స్థాపననుండి ఈనాటివరకు) భవిష్యత్తును తీక్షణంగా పరిశీలించవలసి వుంది. ఇక్కడ విప్లవ రచయితలు స్పష్టమైన సాహిత్య, సామాజిక, రాజకీయ ఆర్థిక అవగాహనతో, జరిగిన - జరుగుతున్న ప్రజాపోరాటాలను విశ్లేషణ జరుపుతూ వ్యాఖ్యానిస్తూ సరియైన అవగాహనను అందించడం అవసరం.

ఇక్కడ "విప్లవ వాస్తవికత" అంటే ఏమిటి? అనే ప్రశ్నకు పరిమితమై మాట్లాడితే తేలుతున్న సారాంశం ఇది. దేశంలో అనేక ప్రాంతాల్లో చెలరేగిన సాయుధమైన తిరుగుబాట్లు ఈనాడు యధార్థాలు. పాలకవర్గాలు వీటిని సంఘ విద్రోహక శక్తులకింద కొట్టిపార వేసినా నిబద్ధ రచయితలు వాటి అంతర్గతమైన రాజకీయ- సామాజిక వాస్తవికతలను గుర్తించాలి. నక్సలైట్లు అనబడేవాళ్ళని పోలీసులు కాల్చివేస్తే విప్లవ రచయిత ఆ త్యాగమూర్తులైన విప్లవ వీరులను చరిత్రకెక్కించి ప్రజల కళ్ళు తెరిపించాలి. ఈ పోరాటాలలో ఎంతమంది మెరికల్లాంటి యువకులు ప్రాణాలకు తెగించి ఎందుకు వెడుతున్నారనే అంశాన్ని ప్రజలకు వివరించాలి. ఎంతమంది ఈ బూర్జువా న్యాయసూత్రాలకు రేపు ఉరికంబం ఎక్కబోతున్నారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. దోపిడీ హింసకు (లేదా పాలకవర్గాల హింసకు) విప్లవాత్మకమైన హింసకు తేడా ఏమిటో చెప్పాలి— వీటిమధ్యవున్న స్పష్టమైన అవగాహనను ప్రజలకు అందివ్వగలగాలి.

రైతుల - కార్మికుల శ్రామికశక్తికి రాజ్యాధికారం ఎందుకు అవసరం, దానిని సాధించే ఈ పోరాటాలు ఏవిధంగా వర్గపోరాటాలుగా బయలుదేరి శ్రామిక సాయుధ పోరాటాలుగా పరిణమిస్తాయో వివరించి చెప్పాలి. జరిగిన లోపాలను, జరుగుతున్న

విప్లవాత్మకమైన సంఘటనల గురించి సరియైన అంచనా వేయగలగాలి. ఈ దోపిడి వ్యవస్థను మార్చే నిర్ణయాత్మక శక్తులకు దోహదపడాలి. అప్పుడే విప్లవం మినహా ఈ దేశానికి గత్యంతరం లేదనే వాస్తవికతను అందించినప్పుడే అది విప్లవ వాస్తవికత అవుతుంది.

గతకాలాలలో 'ఉదయిని', 'ఎర్రి జెండాలు' తదితర రచనల ద్వారా ఈ విప్లవ వాస్తవికత వ్యక్తమైనది.

విప్లవ వాస్తవికతకు సరియైన అభివ్యక్తిని ఇచ్చే ప్రియత్నం నిరంతరంగా ఇంకా కొనసాగుతూనే వుంది.

శాంతి ఎవరికి?

"ఈ నాడు శాంతి శాంతంటూ శాంతికోసం కలవరించే వారెవరో ఒక్క క్షణం ఆలోచించండి. జనానికి శాంతి పన్నాలమీద విశ్వాసం ఎందుకు సడలి పోతుందో తెలుస్తుంది.

స్వేచ్ఛగా మసలడానికో యిల్లూ, కడుపునిండా తినేందుకు తిండీ, కట్టేందుకు ఖరీదైన గుడ్డా అందిన వాళ్ళందరికీ శాంతి కావాలి.

ఇవన్నీ అమరకపోయినా వాటిని ఆర్జించుకునే అవకాశం దొరికినవాళ్ళకి— దాన్నుపయోగించుకొని పెరగడానికి శాంతి చాలా అవసరం.

ఈ తక్కువ కాలంలోనే అంది పుచ్చుకున్న అవకాశాల్తో అవలీలగా ఆస్తులు సంపాదించిన పెద్దలకు తామే కాక తమ తరవాత తరాలుకూడా నిష్పూచీగా నిరాటంకంగా అనుభవించేందుకు, సుస్థిరమైన శాంతి తప్పకుండా కావాలి.

దురదృష్టమేమిటంటే ఈ దేశంలో అలాంటివాళ్ళు చాలా తక్కువ మంది ఉన్నారు. తరతరాలుగా అష్టకష్టాలూ పడుతున్నా, ఈ నాటికీ తిండికీ గుడ్డకూ నోచని వారి సంఖ్య కోట్లమీదవుంది. వాళ్ళందరూ ఈ వ్యవస్థను శాంతంగా యిలాగే సాగనిస్తే వాళ్ళకేకాక వాళ్ళ తర్వాత తరాలక్కూడా బ్రితుకల్లా తీరని హింసా, అశాంతీ తప్పవు"

— కాశీపట్నం రామారావు

విప్లవ సాహిత్యోద్యమం - కథలు I

మరువాడ రాజేశ్వరరావు

విప్లవ సాహిత్యోద్యమంవల్ల కవిత్వంలో వచ్చినట్టే కథలోకూడా కొన్ని విప్లవకరపరిణామాలు వచ్చేయి. ముఖ్యంగా చెప్పుకోతగ్గది కథావస్తువులో విస్తృతి. ప్రయోజనం దృష్ట్యాకూడా కథ మంచి పరిణామం సాధించింది.

ప్రజలలో నానాటికీ పెరుగుతున్న విప్లవ చైతన్యాన్నీ, ప్రజల జీవిత పరిస్థితుల విప్లవోన్ముఖతనీ ఈనాటి జీవిత సత్యంగా విప్లవ రచయితలు గుర్తించేరు. ఈ జీవిత సత్యాన్ని నిరూపించే కథలు విప్లవ కథలు. విప్లవ కథలు ప్రజా చైతన్యంలోంచి పుట్టినవే కాక, ఆ చైతన్యానికి దోహదం చేసేవిగాకూడా ఉంటాయి. విప్లవ సాహిత్యోద్యమం విరసం రూపంలో సంఘటితం కాకముందు 'పిపీలికం', 'యజ్ఞం'వంటి విప్లవ కథలు వచ్చేయి. విరసం ప్రారంభమయేక విప్లవ కథలు విస్తృతంగా వచ్చేయి.

గ్రామీణ ప్రజా జీవితం, మధ్యతరగతి ప్రజల మనస్తత్వం, మతోన్మాదం, మూఢనమ్మకాలు, రాజకీయ ఉద్యమాలు, అధికార నియంతృత్వం, వ్యాపారాల్లో కల్లోలం —అన్ని రంగాల్లోనూ విప్లవ చైతన్య ప్రభావం ఉంది; అన్ని రంగాల్లోనూ విప్లవానికి దోహదం చేసే అంశాలున్నాయి. విప్లవ రచయితల కథావస్తువు దాదాపు అన్నిరంగాలకీ విస్తృతమైంది. యిది, అంతకు ముందరి పరిస్థితికి పూర్తిగా భిన్నం.

కథలో వాస్తవ చిత్రణచేస్తే అది తప్పకుండా పాఠకుడిలో చైతన్యం కలిగిస్తుంది. ఈ చైతన్యం రెండు రకాలు. ఒకటి, 'జరిగిందీ, జరుగుతున్నదీ తెలుసుకోవడం' వరకే పరిమితమైంది. రెండు, జరగవలసిందాన్ని గురించికూడా ఆలోచింప చేసేది. జరిగిందీ, జరుగుతున్న దాంట్లోంచే జరగవలసింది కూడా ఉత్పన్నమౌతుంది. అందుచేత మొదటి రకం చైతన్యంకన్నా, రెండోరకం చైతన్యం గుణాత్మకమైన పరిణామం. ఈ పరిణామంవల్ల సాహిత్య ప్రయోజనం పరిపూర్ణ స్థాయిని చేరుకుంటుంది. ఈ స్థాయిని సాధించడానికి విప్లవ రచయితలు చేస్తున్న కృషిలో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంలో, యింతవరకూ జరిగిన కృషిని సమీక్షించుకోవడం అవసరం. విప్లవ రచయితలు రాసిన కథలన్నిటినీ పరిశీలించడం ఈ వ్యాసానికి అసాధ్యమూ, అనవసరమూ కూడా. ఈ పరిశీలన రచయితలపట్ల కాకుండా, రచనల్లో వైవిధ్యంపట్ల ఎక్కువగా జరుగుతుంది.

కాళీపట్నం రామారావుగారి 'భయం', 'చావు', సి యస్. రావుగారి 'రాజనీతి' 'యిప్పుడు వీస్తున్నగాలి', శ్రీపతిగారి 'తూరుపు', మొదలైన కథలు గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. గ్రామీణ ప్రజా జీవితంలోని చైతన్యాన్నీ, ఆ చైతన్యం పట్ల రచయితకుండే దృక్పథాన్నీ కూడా ఈ కథల్లో చూస్తాం.

పీడితవర్గంలోని అంతస్సంఘర్షణనీ, వివిధ దశలలో ఉన్న చైతన్యాన్నీ, యితర వర్గాలతో విప్లవ శక్తులకుండే బాహిర సంఘర్షణనీ కూడా స్పష్టంగా చిత్రించిన కథ 'చావు'. గ్రామాల్లో పరిజలెదుర్కొనే ఏ చిన్న సమస్యకీ పరిష్కారం వాళ్ల చేతుల్లో లేదు. ఏపని చెయ్యడానికీ వాళ్లకి స్వతంత్రం లేదు. ఈ బానిస పరిస్థితిని ఈ కథలో దిగంబరం చేసి చూపించేరు రచయిత. బానిస పరిస్థితికి ప్రధానకారణమైన ఆర్థిక, రాజకీయశక్తుల్ని కూడా ఈ కథలో బైటపెట్టేరు రచయిత.

'బానిస పరిస్థితి', ప్రజల చైతన్యంపైన ఎలాగ పనిచేస్తోందో, ఏ రకమైన అంతస్సంఘర్షణలకి దారితీస్తోందో, ఎటువంటి పరిష్కారాన్ని ఎదుర్కొనబోతోందో చెప్పే నేర్పు శ్రీ కా. రా. రావుగారి తరవాత మరెవర్లోనూ కనపడదు.

సూరయ్య, రాజయ్యలాంటి పెద్దలందరికీ వ్యక్తిత్వం చచ్చిపోయింది. వాళ్ళ గుండెల్లో మంటలకి బదులు మంచుగడ్డలున్నాయి. బారిక్కన్నయ్యకి పాలకవర్గాలిచ్చిన గుత్తాధికారం కొంత ఉంది. పాలకవర్గాల పక్షం మాట్లాడుతూ, తనవాళ్లని మోసగించే, 'గోతు లీసే రకం'. వీళ్ళంతా అప్పారావు లాంటి యువకులకి నిరాశ నూరిపోసి అతన్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అప్పారావు యువకుడు. చలీ, భయం అతన్నంటవు. ఎదురు తిరిగి పోరాడితేగాని బ్రతుకులేదనే జ్ఞానం, ఆవేశం అతనికి ఉన్నాయి. రచయిత దృష్టిలో యువతరానిదే చివరిమాట.—

"ఇయ్యేళ నించి యిదేనెక్క. ఒక పనిసేస్తే నాయుదేటంటాడో, కరణం వేటంటాడో, బారికేటంటాడో కాదు. మంచిపనా, సెడ్డపనా ? మంచిదయితే సేసెయ్. దేవుడుకాదు. దేవుణ్ని పుట్టించిన జేజెమ్మేనా దెబ్బలాడు!"

సి. యస్. రావుగారి, 'యిప్పుడు వీస్తున్నగాలి' కథలో, 'మాల'ల్ని మాదిగోళ్ని గుళ్ళోకి ప్రవేశపెట్టి ఒక సంస్కరణని సాధిస్తాడు ప్రకాశం. అయినప్పటికీ,

"గుళ్ళో దేవుడు గుళ్ళోనే ఉన్నాడు. మాదిగపేటలో మాదిగలు మాదిగపేటలోనే ఉన్నారు. మాలపల్లి మాలలు మాలపల్లిలోనే ఉన్నారు. వూళ్ళో పెద్దలు వూళ్ళోనే ఉన్నారు. ప్రకాశం తన యింట్లోనే ఉన్నాడు. మార్పేమీలేదు."

మార్పుకి యిది మార్గం కాదేమోనని ఆలోచనలో పడతాడు ప్రకాశం. సంస్కరణవాదంవల్ల ఫలితం ఏమీ ఉండదనే సూచన కథలోఉంది.

అయితే, కథలోని ముఖ్యసంఘటనల్లోను, 'మాలలు, మాదిగ'లని చెప్పబడే జనాన్ని చిత్రించడంలోను సహజత్వం లోపించింది. మూఢాచారాలు, మూఢనమ్మకాలు వ్యక్తుల మీది భక్తి గౌరవాలకన్నా చాలా బలమైనవి (కుటుంబరావుగారి 'చదువు' నవలలో పరికాశం మేనమామ ఒక ఉదాహరణ).

కథ పరిణామంలోని అసహజత్వాన్ని గ్రహిస్తే ఒక ముఖ్యమైన విషయం బోధపడుతుంది. కొన్ని సంస్కరణల ప్రాతిపదికమీద పీడితజనంలో ఐక్యత సాధించడం అసాధ్యం. (అసాధ్యమైనదాన్ని సాధించినట్టు చూపించడంవల్లనే అసహజత్వం చోటుచేసుకుంది). యిప్పుడు మనం సంస్కరణలనుకుంటున్నవి జనం జీవన పరిస్థితులు బాగుపడి, విజ్ఞానం అందరికి అందుబాటులోకివచ్చి సరైన సామాజిక వాతావరణం ఏర్పడిన్నాడు వాటంతటవే జరుగుతాయి. జీవితంలోని ప్రధాన వైరుధ్యం సంస్కరణల వల్ల సాధించేదికాదు. సంస్కరణలు జరగడానిక్కూడా వ్యవస్థలో సమూలమైన మార్పు రావలసి వుంది. ఆ సమూలమైన మార్పుకోసం తప్ప, మరెందుకూ— అన్ని కులాల, అన్ని మతాల, అన్ని జాతుల పీడిత ప్రజలూ— ఏకం రాలేరు. 'యిప్పుడు వీస్తున్నగాలి' కథ సహజంగా పరిణామం చెంది ఉంటే, ఈ విషయమే రుజువయేది.

పులులూ, సింహాలూ. ఋగతలూ. జమీందార్లూ మొదలైన క్రూరమృగాలు ఎలాంటివో జనానికి తెలుసు వాటిని ఎదిరించాలనీ వాళ్ళకి తెలుసు. ఎలా ఎదిరించాలో కూడా తెలుసు. తెలివైన క్రూరమృగాలైతే, మేక తోళ్ళూ, ఆవు ముఖాలూ, సోషలిజాలూ తొడుక్కుని తమ 'రాజనీతి'ని నిలబెట్టుకుంటాయి. ఈ సత్యాన్ని సి. యస్. రావుగారి 'రాజనీతి' కథలో చూస్తాం.

నారాయుడు తన'రాజనీతి'కి ఎదురొచ్చిన వాళ్ళమీద అహంకారంతో గర్జిస్తాడు. అతని కొడుకు కృష్ణమూర్తి తెలివైననాడు కనక ఆవు మొహం తొడుక్కుని, వలపన్ని పాత రాజనీతినే కొత్త పద్ధతిలో అమలు పరుస్తాడు కృష్ణమూర్తి తొడుక్కున్న ఆవు ముఖాన్ని, అతను పన్నిన వలనీ కొండయ్య అర్థంచేసుకున్నాడు, కాని అంతకన్న క్లిష్టమైన చిక్కులతోనూ, వ్యూహాలతోనూ వలలుపన్నిన ఆవు ముఖాల క్రూరమృగాలు వాటి 'రాజనీతి'ని ఈనాడు బాహాటంగా అమలు జరుపుతున్నాయి. ఆ కలర్ని సోషలిజం ఆవుముఖాల వెనకఉన్న, పచ్చిరక్తంతాగే క్రూరజంతువుల్ని కనుక్కోవడం అమాయకులకి కష్టం. జనాన్ని నడిపించే నాయకత్వంలోకూడ అందరూ కొండయ్యలాంటి

వాళ్ళులేరు. 'బందూకిష్టు'ల నాయకత్వంలో వలల్లోనే చిక్కుకుని, క్రూరమృగాల రాజనీతికి బలిఅవుతూనే ఉన్నారు జనం. నిజంతెలుసుకున్నరోజు వాళ్ళంతా కొండయ్య లాగే ఈ దోపిడీ ఆర్థికాలం "సాగదు, సాగనివ్వకూడదు" అనుకుంటారు, 'చివరి నిర్ణయంగా' వాళ్ళకి రమణయ్యమాష్టారి లాంటివాళ్ళే ఆదర్శం. సి. యస్. రావుగారి 'రాజనీతి' కథ నిగూఢంగా ఉన్న జీవితసత్యాన్ని స్పష్టంగాను, సూటిగాను, బలంగాను చెప్పిన చాలా 'మంచికథ'.

శ్రీపతిగారి 'తూరుపు' కథలో, ప్రస్తుత వ్యవస్థలో అధికారం ఎక్కడోవున్న గవర్నమెంటుకాదు- పూళ్ళోనేఉన్న భూస్వామి ఎలా చెలాయిస్తాడో స్పష్టంగా చెప్పేరు ఈ వర్గ ప్రభుత్వానికి వీళ్ళే కళ్ళు, చెవులూ. వీటిని తుడిచిపెట్టండన్న మెస్సేజ్ స్పష్టంగా బోధపడుతుంది. జీవితాన్ని చిత్రించడంలోనూ, పాత్రల్ని, సంఘటనల్ని Reveal చెయ్యడంలోనూ పాఠకుడిలో తాదాత్మ్యత కలిగించే గుణం ఈ కథలోఉంది. ఇలాటి కథలు ఉద్యమంలో ఎంతో అవసరం.

'కలభాలు', అత్తలూరి నరసింహారావుగారి 'ఇంకానా ...' అనే కథల్లో భూస్వాములకీ, భూస్వాములకీ మధ్య అమాయకులైన పాలేర్లు బలైపోవడం కనిపిస్తుంది. ఆస్తులు సంపాదించిన 'పెద్దల' దురాశకి అంతుండదు. ఒకడివెనక ఒకడు గోతులుతీస్తాడు. అంతా సవ్యంగా జరిగితే బాగానేఉంటుంది, ఏదేనా ప్రమాదంవస్తే 'బలి'కావడానికి పాలేర్లున్నారు. 'కలభాలు' కథలో, రావుగారిలోనూ, రెడ్డిగారిలోనూ ఉన్న వర్గ చైతన్యం భీముడిలోను, రంగడిలోను లేకపోయింది. వాళ్ళకేకనక వర్గ చైతన్యంఉండి ఉంటే అటు రావుగారి తల, యిటు రెడ్డిగారితల పగిలిఉండేవి. 'ఇంకానా...' అనే కథలో, "ఆళ్ళూ ఆళ్ళూ బాగానేఉండారు- మధ్య పోయేకాలం మనకేమొచ్చిందంట? అని గూడెంలో అగ్గి అంటుకుంది" అని రచయిత చెప్తాడు. 'అంటుకోవడం' మనకెక్కడా కనిపించదు. ఆ అంటుకున్నది రావణకాష్ఠమో, లేక వొట్టి తాటాకులో అనే అనుమానంకూడా వస్తుంది.

ఒక్క రెండేళ్ళకిందటివరకూ గ్రామీణ జీవితాన్ని విశ్లేషించే కథలు యిన్ని రాలేదేమో. ఈ రెండేళ్ళలోనూ జరిగిన మంచి పరిణామానికి కారణం విప్లవసాహిత్యోద్యమం. గ్రామాల్లో, కొండల్లో, కోనల్లో రేచిన పోరాటాల మంటల్ని, (పొరల్లేని) స్వచ్ఛమైన కళ్ళతో చూడగలిగినవాళ్ళు విప్లవ రచయితలు. ఈ వ్యవస్థకి ఆయువుపట్టు గ్రామాల్లోనూ, పల్లెల్లోనేఉంది. ఈ పాడు వ్యవస్థకి చావుదెబ్బకూడా గ్రామాల్లోనూ, పల్లెల్లోనే తగులుతుంది. గ్రామీణ జీవితంలోంచి యింకా చాలా కొత్త కొత్త రచయి

తలూ, కథలూ వస్తాయనడానికి సందేహంలేదు. ఈ కొత్త రచయితల్నీ, కథల్నీ విరసం ఆహ్వానిస్తుంది.

గ్రామీణ జీవితానికే సంబంధించిన, మతాన్నిగురించీ, మూఢనమ్మకాల గురించీ వచ్చిన కథ తాడిగిరి పోతరాజుగారి 'సృష్టి'.

జనంలో అత్యధిక భాగానికి దేవుడికి, మతానికి, ప్రకృతికీ సంబంధించిన మూఢ నమ్మకాలనేకం ఉన్నాయి. అయితే, అందరిలోఉన్న నమ్మకాలనీ ఒకేలాగ చూడలేం. వీరాయ్, అతని రెండోకొడుకులాంటి సాధారణ జనం నమ్మకాలవెనక అమాయకత్వం ఉంది. అజ్ఞానంతోకూడిన నిజాయితీఉంది. శాస్త్రిలు, తతిమా ఊరిపెద్దలాంటి నమ్మకాలవెనక అధికారకాంక్ష, కులతత్వంవంటి Vested Interests, హింసా ప్రవృత్తి ఉన్నాయి. తమ గుత్తాధికారాన్ని నిలబెట్టుకునేందుకు తర్కవకులాల్ని సృష్టించి వాళ్ళ చేత అడ్డమైన చాకిరీచేయించుకుని, ఫలితాన్నిమాత్రం అనుభవిస్తారు 'పెద్దలు'; వీరాయ్, రెండోకొడుకు రాత్రింబగళ్ళు కష్టపడి 'అమ్మవార్ని'తయారుచేస్తే, ఆ అమ్మవారికి 'చూపు' కలిగించి 'పుణ్యం' మూటకట్టుకోవలసినవాడు శాస్త్రిలు. మతంలోను, కులవ్యవస్థలోను ఉన్న దోపిడీ యిది,

అమాయకత్వం కారణంగాను, అజ్ఞానంతోకూడిన నిజాయితీతోను మూఢనమ్మకాలున్న జనం అర్థంచేసుకోగల దోపిడీయిదే. వాళ్ళు తిరగబడేదికూడా వీరాయ్‌లాగ, అతని రెండోకొడుకులాగనే. ఆ తిరుగుబాటుకి కారణమైన చైతన్యం, అన్నాళ్ళూ మానసికంగా కృంగిపోయిన జాతికి కొత్త వ్యక్తిత్వాన్నిచ్చి, ఆ తరవాతిదశలో, వాళ్ళకి పట్టిన మూఢనమ్మకాల బూజునే దులిపేసుకోగల ఆత్మవిశ్వాసాన్ని యిస్తుంది, మతాన్ని, మూఢనమ్మకాలనీ కూకటివేళ్ళతో పెరికేసే ప్రయత్నం 'సృష్టి' కథ; కాని; వీరాయ్‌కొడుకు పాత్రలోని చైతన్యం చిత్రించడంలో స్పష్టత లోపించింది.

నెహూర్రీగారు గ్రామాలకి చూపించిన 'అభ్యుదయపథం' ఎంత 'అభ్యుదయకర'మో కాశీపట్నంవారి యజ్ఞం కథలోచూసేం. ఈ నాటి 'ఆకుపచ్చ విప్లవాలు', పేద రైతులకి రుణాలిచ్చే పథకాలూ వగైరా 'సోషలిస్టు పథకాల, రూపురేఖల్నికూడా బయట పెడుతూ కథలు రాయాలి,

(సశేషం)

విప్లవ నవల

కె. వి. రమణారెడ్డి

"ఆలూలేదు. చూలూలేదు, కొడుకుపేరు సోమలింగం" అన్నట్టుగా, ఇంకా వెలువడవలసి ఉన్న ఈ సాహిత్య ప్రక్రియకు రూపాన్నీ లక్షణాల్నీ ఏర్పాటు చెయ్య జూడడం, పరిహాసాస్పదంగా ఉంటుందని అనుకోనక్కర్లేదు. వి. ర. సం. లో కథా కారులేగాక నవలాకారులుగూడా ఉన్నారు కాబట్టి గమ్యాన్నిగురించి ముందొక స్పృహ కలిగితే, వాళ్ల రచనా ప్రయత్నాలు తమదారి తాము వెతుక్కొంటాయి.

మన సాహిత్యప్రక్రియ లన్నిటిలోకి, రాశిలో నవలదే పెద్దపీట. అయినా జీవితచిత్రణ విషయంలో మన నవలకింకా యుక్తవయస్సు రాలేదనేచెప్పాలి. మినహా యింపులుంటే ఉండవచ్చుగాని, వాటిసంఖ్య స్వల్పమే. తెలుగు నవలాకారులు ఇంకా తమ ఊహనేపట్టుకు వేళ్ళాడుతున్నారంటే అతిశయోక్తికాదు. మన నవలా పాఠకులు కూడా ఊహామయమైన రచనలంటే చెవిగోసుకొంటున్నారు. ప్రచురణ కర్తలు సరే సరి. లాభార్జనే వాళ్ళనీతి. చిన్న చిన్నతుప్పలు వందలాదిగా వేలాదిగా బలిసిపోయిన shrub-jungle లా ఉంది నేటి మన నవలాలోకం. దీనికి కారణాలు చూపవలసివస్తే, మన నవలాకారులకు తమ అభిమానప్రక్రియ గురించి ఉండవలసినంత సదవగాహన లేదనటం మొట్టమొదటిది. ఏదో రాయడమేగాని ప్రయోజనాన్ని ఆశించి మరీరాయడ మనేది గగనంగా ఉంది. తలలోకి దూరివచ్చిన జీవితవాస్తవం తాలూకు వివేచనచేసి, అర్థవంతమైన అంశాలను స్వీకరించి రాయడమనేది బహుకొద్ది. చూపంతా వెండితెర మీదనో, తప్పితే ప్రచురణకర్త ఇచ్చే ప్రతిఫలంమీదనో, ఇంకాపోతే, సచిత్ర వార పత్రికలిచ్చే బహుమాన ధనంమీదనో నిలుస్తున్నది. సంపాదకులకు పాఠకులు రాసి పంపే ప్రశంసలతో తృప్తిపడిపోతున్నారు.

మరి, ఈ నేలలోంచే విప్లవ నవల బయల్పడాలి! ఎలా? ఏం సాధనం? విప్లవ నవలాకారులు ఆకాశంలోంచి ఊడిపడరు. ప్రారంభంగానైనా, నేటి నవలాకారులే సంకల్పపూర్వకంగా విప్లవ నవలలు రచించేందుకు పూనుకోవాలి. సంకల్పం అనేది ఎలా కలుగుతుంది? మన సంఘం ఎదుర్కొంటున్న సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి, ప్రజాపక్షంగా తమ అభినివేశాలను సంస్కరించుకొంటూ, ప్రజలతో మమేకమౌతూ ఆలోచించడం అలవరచుకొంటూ, సాంఘిక వ్యవస్థను సమూలంగా మార్చే ఉద్యమాలతోటీ పోరాటాలతోటీ భావైక్యతను పెంపొందించు

కొంటూపోతే, రచయితలకు ఈ సంకల్పం మొనజూపుతుంది. వర్గదృక్పథాన్ని ముందుగా తాను పదునుపెట్టుకోవాలి. మార్క్సియన్ సోషలిస్టు ప్రాపంచిక దర్శనం తమకు కనీసమాత్రంగానైనా పరిచయం కావాలి. ఇతరదేశాల విప్లవసాహిత్య ధోరణులను పరిశీలించకపోయినా, వాటిగురించి తెలుసుకోవాలి. ఈలిస్టు పెద్దదేమీకాదు. కాబట్టి ఈ పనులు అసాధ్యమైనవీకావు.

జీవిత వాస్తవాన్ని దర్శించే పద్ధతిలోనే ఇతర నవలాకారులకూ విప్లవ నవలాకారులకూ అంతరం ఉంటుంది. ఈ వాస్తవం నిశ్చలపదార్థం కాదు. నిరంతర పరిణామాత్మకమైన లోకంలో ఏ అంశం మానవజాతి ముందడుగుకీ పైఅడుగుకీ సహాయకరమౌతుందో, దాన్ని మిగతవాటినుంచి విడగొట్టాలి ఎందుకంటే, పరిణామం అందులో గర్భస్థశిశువులాగా వేచి ఉంటుంది. కాబట్టి మిగత వాటికంటె ఇది మిన్న. అర్థవంతమయ్యేదల్లా (significant) ఇదే. తతిమావి దానికి ఆటంకాలుగానో పరిపోషకాలుగానో ఉంటాయి. ఈ రెండవజాతి అంశాలనుకూడా రచయిత తలకెక్కించుకొంటాడు. ఇవన్నీకలిసి నవలకు మూలకథను (theme) ఏర్పరుస్తాయి. మరి, దానినుంచి పాత్రల సాయంతోటి విపులకథ వెలువడుతుంది. అందుచేత, జీవితవాస్తవాన్ని ప్రతిబింబించే ముందు, రచయిత తానుగ్రహించిన వాస్తవంలోగల అంశాలను తారతమ్యదృష్టితో వివేచించుకోవడం అవసరం.

అయితే, లోకంలోలాగానే నవలాలోకంలో కూడా, ప్రముఖమైన, అర్థవంతమైన అంశాలను అల్పిష్ఠి అంశాలెన్నో అంటిపెట్టుకొని ఉంటాయి. జీవితాన్ని జీవితం అనిపించేది ఈ అల్పానల్ప అంశాల కూడికే. జీవితానికి రుచినీ రంగునీ ఇచ్చేదీ ఇదే. ఘటనలకేగాక, పాత్రలకుగూడా విశ్వసనీయత, సంభావ్యత (Probability) కలిగేందుకు ఈ చిన్న చిన్న అంశాలు తోడ్పడుతాయి. అందుచేత, నవలానిర్మితిలో వీటికిగూడా యథోచితమైన స్థానం ఉంటుంది. కాకుంటే, ఏ నవలకూడా జీవితమంత విశాలంగానూ విపులంగానూ ఉండదు కాబట్టి, నవల అనేది ప్రతిదిన్నీ జీవితవాస్తవంలోని ఒకానొకకోణానికి అక్షరరూపమైన ప్రతిసృష్టే కాబట్టి, జీవితంలోలాగా రచనలో అన్ని అంశాలూ నిండారనక్కర్లేదు. కొన్నిమాత్రమే దూరివస్తాయి. వాటంతట అవి రాకుండా, నవలాకారుని సంకల్పపూర్వకమైన ఎంపిక ఫలితంగానే, రచనలో జాగా చేసుకొంటాయి. ఎంపిక అన్నప్పుడు, ప్రధానమైన అంశాలకు నిండుదనాన్ని ఇచ్చేందుకే అప్రధానమైన అంశాలనుకూడా రచయిత చేరబిలుస్తాడన్నమాట. అప్పుడే నవల రచనావిశేషంగా రాణిస్తుంది.

జీవిత వాస్తవంలోని చీకటికోణానికి చెందిన అంశాలను మిగతవాటికంటె ఎత్తిపట్టి చూపడం, జీవిత వాస్తవాన్ని ఉత్తమ మార్గానికి మలపకోరే రచయితకు తగదు. అందువల్ల తను ఆశించే ప్రయోజనమే దెబ్బతింటుంది. పాశ్చాత్య దేశాల నవలా సాహిత్యంలో, వాటి సాంఘిక వ్యవస్థలో వచ్చిన పతనోన్ముఖమైన క్షైణ్యం ఫలితంగా క్షుద్రమైన ఎన్నో మానసిక వికారాలకూ సాంఘిక ధోరణులకూ పట్టం కట్టడం జరుగుతూంది. కామప్రకోపం, హత్యాప్రవృత్తి, ఆకతాయితనం, వ్యక్తి దురహంకారం, నీచమైన అభిరుచులూ ఇలాంటివి పాఠకుణ్ణి చప్పున ఆకర్షించేస్తాయి. పాఠకుణ్ణి సంస్కరించాల్సిన మన సాహిత్యం వీటిని ఆదరించదు. అట్లని, పూర్తిగానూ తోసివెయ్యదు. వాటికి ఏ మాత్రం స్థానం ఉండాలో ఆ మాత్రమే ఇచ్చి, అనేక negative పాత్రలద్వారా వాటిని నిరసించి, సత్ప్రయోజనాత్మకతను పెంపొందించుకొంటుంది.

పాశ్చాత్య నవలల్లోనూ వాటిననుసరించేకొన్ని మన నవలల్లోనూ ఇప్పుడు కనిపించే బలీయమైన వైఖరి, వ్యక్తిమాత్రుని ఆధిక్యభావం అని చెప్పవచ్చు. ఆ వ్యక్తి కూడా ఎలాంటి వాడంటే, సమాజంనుండివేరుపడి దానికంటె ఎంతో ఎత్తునో ఎంతో దిగువనో ఉన్నవాడు, అతగాడి ఆలోచనగానీ ఆచరణగానీ ప్రాతినిధ్యస్వభావమే లేనట్టు ఉలిపికట్టె చందంగా తయారౌతుంది. తనకు తప్ప మరిదేనికీ తాను ప్రతినిధి కాడు. అహంలోనే గిరిగీసుకొని కూర్చుంటాడు. ఇలాంటి వ్యక్తి సంఘ విరోధి అయినా ఆశ్చర్యంలేదు. నెపోలియన్ లాగా తన అహాన్ని పెంచుకొంటూపోయి సంఘానికి ఉపద్రవకారిగా పరిణమిస్తాడు. లేదా దాన్ని కుంచించుకొంటూ లోకం నుంచి తనమీదనేతాను బహిష్కారశిక్షను విధించుకొని తాంబేటి చందంగా తన డొప్పలోకి దూరి తన వ్యక్తిత్వాన్ని తానే అంతరింపజేసుకొంటాడు. శిథిలమౌతూన్న ధనస్వామ్య వ్యవస్థలో దాని ప్రతినిధులకు అటు లోకాంతకమైన విజేత గుణమో ఇటు ఆత్మ వినాశకమైన విమూఢత్వమో కలగడం సహజం. ఇదే కళలలోనూ ప్రతిబింబిస్తూంది. విప్లవ నవలలు వైదొలగిపోవలసిన ప్రమాదభూయిష్ఠమైన జెలగల మడుగు ఇదే.

ఒకప్పుడు పాశ్చాత్య నవలాకారుల్లోకూడా మహామహులనదగిన రచయితలు జీవితవాస్తవాన్ని చిత్రించేప్పుడు, మెలకువతో మసలుకొన్నారు. తమవర్గమే సమాజంలో తెచ్చిపెడుతూన్న మార్పులగురించి, వాటిఫలితాల గురించి, విమర్శాయుతమైన వాస్తవవాదవైఖరి (critical Realism) అవలంబించారు. వాళ్ళ నవలలు వర్గాలసంఘర్షణను పాత్రలద్వారా ఘటనలద్వారా నిరూపించాయి. అయితే వాళ్ళు జీవితవాస్తవాన్ని

...ఏటంగా, అద్దంలోని నీడచందంగా, ప్రతిబింబించలేదు. బింబ ప్రతిబింబాల వ్యవహారం. వాస్తవవాదానికి సరిపడని సంగతి. ఎప్పుడూ మార్పుకు లోనౌతూన్న సంఘజీవిత వాస్తవంలో ఏ ఖండాన్ని నవలగా మలిచినా, ఆ ఖండమంతటా ఈ సంఘర్షణ కనిపిస్తూనే ఉంటుంది. నవలాకారుడు జడపదార్థమైన అద్దంలాకాకుండా, మారే వాస్తవంలో తానూ ఒక అంశై, తన రచనా ప్రభావంచేత పాఠకుల మనస్సులలో మార్పుపట్ల అనుకూల్యాన్ని కలిగించి, తద్వారా సమాజంలోనిమార్పుకి తోడ్పడుతాడు. అతనిది passive వైఖరి కాదన్నమాట.

బూర్జువావర్గ దృక్పథం నుంచి జీవితవాస్తవాన్ని విమర్శించే నవలలే సామాజిక జీవితంలో మార్పుకి దోహదం చేసినప్పుడు, ప్రజాసామాన్య దృక్పథం నుంచి జీవిత వాస్తవాన్ని విమర్శించే నవలలు మరెంత చెయ్యగలగాలి!

విప్లవ నవలలనేవి విప్లవ పోరాటాలను మాత్రమే వర్ణించేవిగా ఉండాలను కోవడం, అనుభవాల పరిధిని మనంతట మనమే సంకుచితం చేసుకోవడమౌతుందేమో నని నాభయం. వెనకటికి, తెలంగాణా విప్లవ పోరాటసందర్భంలో వెలువడిన కొన్ని నవలలు వీరరసాంచితంగా ఉన్నా, మంచి సాహిత్యంగా పరిగణనకు రాలేదంటే, ఇదే ముఖ్యకారణం అనిపిస్తుంది. తక్షణ పరిస్థితుల ఒత్తిడిలో రచయిత మిగత ప్రపంచాన్నంతా మూసేసుకొన్నట్లు, బాగా పరిమితమైపోయిన మూలకథకే అంటిపెట్టుకొంటే, ఇలాంటి చిక్కే ఎదురౌతుంది. కథలో, పోనీ పెద్దకథలోకూడా ఇలాంటి పరిమితి అనివార్యం కావచ్చు. వైపుల్యంలో వైశాల్యంలో నవల అనేక జీవితాంశాలను స్పృశించే వీలుంది. పూలమొక్కను, దానిచుట్టూ ఉండే తతిమా మొక్కలను చూపకుండానే, ఆ మొక్కన పూచిన పువ్వుని మాత్రమే చూపబూనితే ఎలాగుంటుందో, ఒకే ఘటనకు అనుచితమైన ప్రాముఖ్యం ఇవ్వడం కూడా అలాగే ఉంటుంది. దాని పూర్వాపరాలు, దాని ప్రభావాలు— వీటన్నిటిని గూడా చూపితే, ఆ ఘటన విశ్వసనీయమనిపిస్తుంది. లేకుంటే అవాంతరఘటన అనిపించుకొంటుంది. విప్లవ పోరాటానికి వెనకవైపున ఉన్న ప్రజాజీవితాన్నికూడా చూపినప్పుడు, ఈ ప్రమాదం ఉండదు.

ఇప్పటివరకూ తెలుగు నవలల్లో కమ్యూనిస్టు పాత్రలకు అటు ఆదర్శరూపాలో ఇటు వికృతరూపాలో సృష్టి అయ్యాయి. 'మాలపల్లి'లో బోల్షివిక్ రాజ్యం గురించి, దాని సిద్ధాంతం గురించి ప్రస్తావన ఉన్నా, అది గాంధీవాదానికి సలాముకొట్టవలసినట్లు ఏర్పడింది. అభ్యుదయ రచయితల సంఘం ఆంధ్రదేశంలో ఏర్పాటు కాకముందు నుంచీ నవలలూ కథలూ రాస్తూన్న కుటుంబరావుగారి నవలల్లో చెదురుమదురుగా ప్రెస్ వర్కర్ రూపంలోనో విద్యార్థిరూపంలోనో కమ్యూనిస్టు ఎదురౌతాడు. అయితే ఇతగాడు

ఆకథ అంచులంచుల్లోనే సంచరిస్తాడు, చురకలా ఒకమాట విసురుతాడు మెరుపులా మెరుస్తాడు. ఇంతలోకే కంటికి దూరమౌతాడు తప్ప, కథాకేంద్ర బిందువు, నాయకుడు కాడు. వాడి సాంఘికస్థితి, హోదా, ఏదైనప్పటికీ, ఇతర పాత్రలకంటె భిన్నంగానేగాక భావాలలోనైనా కొంత కేటాగా నిలబడతాడు. మహీధర రామమోహన రావుగారి నవలల్లోని కమ్యూనిస్టు పాత్రలు పోను పోనూ సాధారణ మానవుల్లాగా మంచినీ చెడునీ కలగలుపుకొని ప్రవర్తిస్తాయిగాని, కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన క్లైబ్యాన్ని విమర్శించేందుకోసం పనిగట్టుకొన్నట్టుగా ఒకొకప్పుడు ఈ రచయిత తన కమ్యూనిస్టు పాత్రలలో అవలక్షణాలను చొప్పిస్తున్నాడా అని సందేహం కలగక మానదు. తనలో సిద్ధాంతంమీద ఆచరణమీద లక్ష్యశుద్ధి సడలేకొద్దికీ, తన కమ్యూనిస్టు పాత్రల negative ధోరణులు అతిశయిస్తున్నాయా అనిపిస్తుంది. 'రథచక్రాలు' లోని ఆదర్శబలంగానీ, 'ఓనమాలు'లోని ఆచరణ బలంగానీ మిగత రచనల్లో కనిపించకపోవడానికి, కమ్యూనిస్టు పాత్రలు ఇతర పాత్రల మధ్యకు కన్నీటితుడుపుకోసమో వివేకోదయం కలిగించడం కోసమో చుట్టపుచూపుగా వస్తున్నట్లు తోస్తుంది. చివరకి, ఇటీవలే వెలువడిన దాశరథి రంగాచార్యుల 'మోదుగుపూలు'లోని ఒకపాత్రను వితండవాదిగా ఆవేశపరుడిగా నిరూపిస్తూపోయి తటాలున అడవుల్లోకీ కొండల్లోకీ పంపి తనలాంటి కొందరు సాహసుల్నీ లంబాడీల్నీ సమకూర్చుకొని అదురుదెబ్బలు తీయించే వైఖరి, నైజామ్ పరిపాలనకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీ నడిపిన గొప్ప పోరాటానికి తగిన న్యాయం కలిగించేదిగా లేదు. ఈ విషయంలో, జాతీయవాద దృష్టితో రాసినా, వట్టికోట ఆళ్వారుస్వామిగారి 'ప్రజల మనిషి' మెరుగు. బొల్లిముంత శివరామకృష్ణగారి 'మృత్యుంజయులు' మాట మరి చెప్పేదేముంది?

విప్లవ నవలల్లో కమ్యూనిస్టులు కేంద్రస్థానాన్ని సొంతపరచుకోక తప్పదు. వీళ్ళను పాత్రీకరించేప్పుడు, నవలాకారుడు బాధ్యతతో మెలగవలసి ఉంటుంది. ప్రబంధ నాయకులను వర్గీకరించేట్లుగా ధీరోదాత్తుడు, ధీరశాంతుడు, ధీరలలితుడు అంటూ వర్గీకరించేట్లయితే, లాభం ఉండదు. ఏ పాత్రకూడా "కొయ్యబొమ్మ" కాగూడదంటే, ఆపాత్ర మానవ వ్యక్తిలా కనిపించగలగాలి. మంచినంతా ముద్దజేసి చూపడం ఆ పాత్రను ఖూనీచెయ్యడమే. ఆదర్శానికి రూపకల్పన చేస్తే, ఇలానే అఘోరిస్తుంది. ఇలాంటి నాయక పాత్రకు వ్యక్తిత్వమూ ఉండాలి, ప్రాతినిధ్య స్వభావమూ ఉండాలి. అవ్వా, బువ్వా, రెండూ కావాలి.

ప్రాతినిధ్య స్వభావం రావాలంటే, ఏ పాత్రకూడా ఎవడో ఒకవ్యక్తి తాలూకు ఛాయాచిత్రం కాగూడదు. అలాంటి అనేకవ్యక్తుల లక్షణాలలో అర్థవంతమైన వాటిని తనలో చూపగలిగి ఉండాలి. ముఖ్య ఘటనలకుగూడా ఇలాంటి ప్రాతినిధ్య స్వభావం

ఉండాలి. పాత్రలూ ఘటనలూ 'మచ్చు' (typical) అనిపించాలి. ఇలా అన్నప్పుడు, సగటు లెక్కలు కట్టమని మాత్రం అర్థంకాదు. 'సగటు మనిషి' ఒక అభూతకల్పన మాత్రమే. అలాంటి వాడొకడు భూమిమీద ఉండడు. 'మచ్చు' మనిషి సాహిత్యంలో నైనా ఉంటాడు అతన్నిచూస్తే అలాంటి ఇతరులు ఎందరో గుర్తువస్తారు. నిజానికి, అతను ఒకధోరణికి ప్రతినిధి అవుతాడు.

మనం ఇంకా ధనస్వామ్యవ్యవస్థకిందనే ఉంటున్నామన్న సంగతి మరిచిపోకుండానే, ఆ వ్యవస్థను బద్దలుకొట్టగల మహా విప్లవోద్యమం సాయుధరూపాన్నిగానీ, ఇతరత్రా వర్గపోరాట రూపాలనుగానీ ఆశ్రయిస్తూ రక్తమయంగానూ ఆవేదనాభరితంగాను బయల్పడుతూన్నదని గుర్తించుకోవాలి. అంటే మన నవలలు విమర్శనాయుత వాస్తవవాదాన్ని, అవలంబించాలి. మొదటిది ప్రస్తుతవ్యవస్థకుగల రుణపక్షాన్ని, రెండవది రాబోయే వ్యవస్థ తాలూకు ధనపక్షాన్ని చూపెడుతాయి. అయితే ప్రపంచంలోలాగే సాహిత్యంలోకూడా పూర్తి తెలుపు, పూర్తి నలుపు అంటూ రెండే రెండు రంగులేవు. ఈ రెంటినడుమ ఎన్నో రంగులున్నాయి. అంతే కాదు, ఈ రెండూ వేరువేరుపాళ్లలో కలగలిసి ఎన్నో రంగులను సృష్టిస్తున్నాయి. కాబట్టి మన నవలల్లో పాత్రలను చిత్రించేప్పుడు, ఒక అతిమంచి, ఒక అతిచెడ్డ, ఒక పూర్తి మంచి, ఒక పూర్తి చెడ్డ- ఇలా గాకుండా, మంచి చెడ్డల సమ్మిశ్రణంగా పాత్రలవ్యక్తిత్వాలు రూపొందాలి. సోషలిస్టు సమాజాన్ని నిర్మించగోరే వాళ్లలోకూడా అంతరాలున్నాయి, అంతస్తులున్నాయి. పైగా ధనస్వామ్యవ్యవస్థ తాలూకు దుష్ప్రభావాలు వీళ్ళను రకరకాలుగా మలుస్తాయి, కాబట్టి ఏ పాత్రనూ ఆదర్శీకరించగూడదు, ఆదర్శీకరణ ఈక్వల్‌టూ అబద్ధీకరణ.

విమర్శాయుత వాస్తవవాద వైఖరిని అవలంబించే మన తెలుగు నవలల్లోకూడా, ధనస్వామ్యవ్యవస్థ తాలూకు సాంఘిక వాస్తవాన్ని సమగ్రంగానూ అర్థవంతమైన ధోరణులు చూపుతూనూ వెలువడిన నవలలు చాలా కొద్ది. అసలు వాస్తవాన్ని గౌరవించే వైఖరే మన నవలాకారులకు అనేకానేకులకు యింకా అలవడవలసిఉంది. దాన్ని వివేచించి విశ్లేషించే వైఖరి ఎలాగూ లేదు. అమ్మాయి, అబ్బాయి, దొరికితే చాలు ఒక నవల తయారౌతుంది. ఇరువైపులా తలితండ్రులూ స్నేహితులూ ఇతరపాత్రలౌతారు. పెళ్ళిపీటలమీదనో పడకగదిలోనో శ్రీ వేంకటేశ్వరస్వామి శ్రీచరణసన్నిధిలోనో కథ రంగంమీద తెరపడుతుంది. ఇవి అధమాధమమైన రచనలు. మన కుర్రాళ్ళను బురదలో పందిలా తృప్తిగా దొర్లింపజేసేవి ఇవే. మరికొన్ని నవలలున్నాయి: వాస్తవం ఎంతో ముడిసరుకుని రచయితలచేత పడుతుంది. అందిందాన్ని అందినట్లు వాళ్ల తమ రచనల్లో దూరుస్తారు. వివేచనకు పనికల్పించరు. ఫలాలుమాత్రమేచూసి మూలాలను

చూడ కేనట్లు, భార్యాభర్తల కీచులాటల మొదలు యజమానీ పనివాళ్ల తగాయిదాల వరకూ, సాంఘికరూపాన్ని చూడరు. సాంఘికధోరణుల వైయక్తికరూపాలతోనే నవలాకారుని పరిమేయం అనుకొన్నప్పటికీ. వ్యక్తి ఆలోచనకుగానీ ఆచరణకుగానీ సాంఘిక స్వభావం వుండక తప్పదు. చెట్టుకొమ్మనే తప్ప పండేదీ పండదు. అంతకంటె ఉన్నతశ్రేణికిచెందిన నవలలు సాంఘికధోరణులను ప్రతిబింబిస్తాయి, సంఘర్షణన్ను నిరూపిస్తాయి గాని వైయక్తిక పరిష్కారాన్నిచూపి సరిపెట్టుకొంటాయి. అనాథ శరణాలయమో, చీకటి నుయ్యో, సాంఘిక గమ్యంకాదు. ఒకడు బాగుపడడంగానీ మరొకడు అణగారడంగానీ ఆవ్యక్తుల విశేషాలు మాత్రమే అని యీ రచయితలు గ్రహించరు. యథార్థాన్ని వివేచించగలిగినా, అది ఏ ఆదర్శంతోనూ ఉజ్జ్వలంకాదు. ఇదే యీ రకం నవలల లోపం.

విప్లవ నవల అనిపించుకోవాలంటే, చేతులేగాక దానికి రెక్కలూ ఉండాలి. అంగుళమంగుళంగా పాకిపొయ్యే మట్టిపురుగుగానేగాక, రెక్కలు విదిలించుకొని ఒక్క ఊపుతోటి ఉప్పరానికి ఎగిరిపోగల పక్షిగాకూడా అది పనిచెయ్యగలగాలి. వాస్తవ చిత్రణకు ఆదర్శబలాన్ని సమకూర్చుకోగలగాలి. నేటి జీవితంలో అది రేపటి జీవితాన్ని బలీయంగానేగాక ఆకర్షణీయంగా, వట్టికోరికగానే కాకుండా అనివార్యమైన చారిత్రిక పరిణామంగా చూపగలగాలి. మట్టి మనుషులలోనే గుప్తంగానో ప్రకటమౌతూనో ఉన్న మహనీయతను మూర్తికట్టాలి. సగటు మనిషినిగాక, చారిత్రిక మహాశక్తిగా ఒక అర్థవంతమైన సాంఘిక ధోరణికి ప్రతినిధులైన వ్యక్తులను, పాఠకుడి ముందు నిలపగలగాలి. పరిణామక్రమంలో దానికి ఇతోధిక వేగాన్ని సరైనతెన్నునీ సమకూర్చే అంశాలకు, తదితర అంశాలకంటె, ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇవ్వాలి, ఈ అట్టడుగు నుంచి ఆ శిఖరాన్ని చూపెట్టాలి. "కారుచీకటిలో కాంతిరేఖ" విప్లవ నవల.

చివరికి ఒక్క హెచ్చరిక :

ఏ నవలైనా విప్లవ నవల కావడానికి ముందుగా మంచినవలై ఉండాలి, విప్లవం పేరుజెప్పుకొంటూ పచ్చికాయల్నిగానీ కుళ్లఫలాల్నిగానీ అమ్ముకొందామంటే, పాఠకులు ఊరుకోరు. పైగా, మన విప్లవాదర్శాన్నే వాళ్ల చులకనజేస్తారు. మూల్యాల విషయంలో అశ్రద్ధ విప్లవ సాహిత్య మూలప్రయోజనాన్నే భంగపరుస్తుంది.

చర్చావేదిక :

విద్య-

సామ్యవాద దేశాల్లో విద్యావిధానం

రచయితలుగా, విద్యావంతులుగా వున్న మనం విద్యనుగురించి అందరి లోకీ ఎక్కువగా ఆలోచించవలసినవాళ్ళం. విద్యలో విప్లవం రావాల్సిందని అందరం అనుకుంటున్నదే.

ఈ విషయంగా విద్యనుగురించి మౌలికంగా పరిశీలించి అసలు తప్పు యొక్క కీలకంఏమిటో ఎందుకు విప్లవం రావల్సిందో ఎలా మారాలో, అందుకు సాంఘిక వ్యవస్థకు సంబంధం ఏమిటో కూలంకషంగా అవగాహనకు రావాలి. రష్యాలో విద్యావిధానంలో గత 50 ఏళ్ళలో ఎన్నోమార్పులు జరిగాయి. అమెరికాలో అనేకానేక ప్రయోగాలు జరుగుతున్నయ్. ఫ్రాన్సులో విద్యార్థులు విస్తారమైన తిరుగుబాటే లేవదీశారు. చైనాలో ఒక పెద్ద విప్లవమే జరిగింది. దేశ దేశాల్లో విద్యనుగురించి చర్చలు జరుగుతున్నయ్. ఇవన్నీ మనకు ఉపయోగపడతయ్.

మనందరి అవగాహనకు ఉపయోగపడేకోసం, అనుభవాలను తెలుసుకొనేకోసం యీ చర్చను ప్రారంభిస్తున్నాము. మన విద్యనుగురించిన నిశిత పరిశీలనతో కొత్త ఆలోచనలతో చర్చావ్యాసాలనూ, దేశదేశాల అనుభవాలను పంపించగలందులకు ఆహ్వానిస్తున్నాం.

—సంపాదకుడు.

చైనాలో విద్య గురించి

చదువు - పరీక్షలు

(13—2—64)

చైర్మన్— ఈరోజు మనం విద్యనుగురించి చర్చించుదాము. పరిశ్రమలు అభివృద్ధి అయినయ్ విద్యా సంస్కరణలు జరగాలి. ఇంకా పరిస్థితి ఏమీ బాగులేదు.

స్కూలు సంవత్సరాలు తగ్గాలె.

గరల్స్ మిలీషియా, స్త్రీలదళాలు ఏర్పడాలి. 16, 17 ఏళ్ళ బాలికలు 6 నెలలో ఏడాదో మిలిటరీ శిక్షణకు పనికొస్తారు.

చాలా ఎక్కువ క్లాసులుంటున్నయ్. విద్యార్థులకు చెప్పలేనంత హాని దానివల్ల. ప్రాథమిక, మాధ్యమిక యూనివర్శిటీల విద్యార్థులందరూ ప్రతిరోజూ ఎంతో మానసిక వత్తిడిలో జీవిస్తున్నారు పరికరాలు వెలుతురూ బాగలేవు. ఫలితంగా కళ్ళ జబ్బులు పిల్లల్లో పెరుగుతున్నయ్.

సగం క్లాసులన్నా తగ్గించాలి. కన్ఫ్యూషియస్ 6 సబ్జక్టులే బోధించాడు. అయినా ఎందరో గొప్పవార్ని తయారుచేశాడు. పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, శీత శారీరక వ్యాయామం అవసరం.

పూర్వం చక్రవర్తులు జరిపిన రాజకీయ పరీక్షలో గెలిచిన వాళ్లలో ఎవరూ పండితులులేరు. పూర్వపు మహాకవులు చాలామంది చదువు పెద్దగాలేనివారే. 18వ శతాబ్దపు గొప్ప నవలాకారుడు ట్సావో ఏ ఉన్నత విద్యాపరీక్షలోనూ ఉత్తీర్ణుడయిన వాడు కాదు.

మింగ్ వంశపు చక్రవర్తులలోని గొప్పవారిద్దరిలో ఒకరు నిరక్షరాస్యుడు. రెండో ఆయన అంతంత మాత్రంగా చదివినవాడు.

తర్వాత 1522-66 లో చియాంగ్‌చింగ్ పరిపాలనలో మేధావులు అధికారాన్ని నడిపారు. దేశం దుష్పరిపాలనకు లోనయింది.

అతిగా పుస్తకజ్ఞానం మంచిదికాదు. హానికరం కూడా.

ప్రస్తుత పరీక్షావిధానం శత్రువులకు పనికొచ్చేదే, ప్రజలకు కాదు. చాటుగా దెబ్బతీసే పద్ధతి యిది. ప్రశ్నలు ఎక్కడివో వుంటవి. పాతపద్ధతిలోనే పరీక్షలు జరుగుతున్నయ్. నేను వీటికి వ్యతిరేకం. నా సూచన ఏమంటే– ప్రశ్నలను ముందే ప్రకటించాలి. వాట్ని విద్యార్థులు చదవనీయండి, పుస్తకాల సహాయంతో 'ఆన్సర్ చేయనీండి'. ఉదాహరణకు ఒక పుస్తకాన్ని గురించి 20 ప్రశ్నలిస్తాం: అందులో పది ప్రశ్నలకు నిజంగా స్వంతభావాలతో జవాబులు రాయగల్గితే నూరుమార్కు లివ్వాలి. ఇరవై ప్రశ్నలకూ జవాబులురాసి అవి స్వంతభావాలతో గాక మామూలుగా వుంటే 50, 60 మార్కులే యివ్వాలి. పరీక్షలో విద్యార్థులు ఒకరికొకరు చర్చించుకోగల్గాలి. ఒకరు రాసింది యింకోరు రాసినా అనుమతించాలి. చెప్పుకోవటాలూ, కాపీలు రహస్యంగా జరిగేవి అవి బహిరంగంగా జరగనీయటం మంచిది. ఒక ప్రశ్నకు నాకు సరిగా తెలియకపోతే, నువురాస్తావు నీనుంచి నేను కాపీజేస్తాను. అలా జరిగితే ఎలా వుంటుందో ప్రయత్నిద్దాం.

లెక్చరర్ చెబుతున్నపుడు విద్యార్థి నిద్రపోతుంటే పోనివ్వాలి. నాన్సెన్సంతా వినేకంటే మంచిగా ఒక కునుకుతీసి రిఫ్రెష్ అవుతారు. పనికిరానిచెత్త ఎందుకువినాలి?

ప్రస్తుతపద్ధతి తెలివిని నొక్కేస్తుంది. కుర్రవాళ్లను పాడుచేస్తుంది. నాకు యిది నచ్చదు. అతిగా చదవటం. పరీక్షావిధానం విద్యార్థులతో శత్రువులాగా పోట్లాడుతుంది. మారణంగా వుంది యిది, మానేయాలి.

ఒక విద్యార్థి— విద్యార్థులకు చదువు చాలా భారంగావుంటున్నది. ప్రతి సబ్జక్టుకూ హోమ్‌వర్క్ చేయాలి.

ఛైర్మన్— కన్ఫ్యూషియస్ యీ విధానాన్ని ఉపయోగించలేదు. లిటుంగ్‌యాంగ్ విద్యావేత్తకాదు. అయినా ఆ కాలంలో ప్రధానమంత్రి అయాడు.

ఇంకొకరు— నిరుడు హోపేలో వరదవచ్చింది. స్కూలు భవనాలు కూలిపోయినవి. అందువల్ల విద్యాశాఖ తీవ్రంగా పనిచేశారు. తాత్కాలిక స్కూళ్లుపెట్టారు. ఫలితంగా ప్రాథమిక, మాధ్యమిక బడిపిల్లల సంఖ్య పెరిగింది.

ఛైర్మన్— వరద డాగ్మాటిజాన్ని కడిగేసింది. విదేశీ, స్వదేశీ డాగ్మాటిజాల రెంటినీ తోసేద్దాం.

గాయకులను, కవులను, విద్యావేత్తలను పట్టణాలనుండి పంపివేయాలి. పల్లెలకు పంపాలి. గ్రూపులు గ్రూపులుగా గ్రామాలకు ఫ్యాక్టరీలకు దఫాలవారీగా పంపించాలి. ఎప్పుడూ ఆఫీసుల్లో వుండటాన్ని మాన్పించాలి, అలా వెళ్లనివారికి తిండే అనవుసరం. అలా వెళ్ళినవాళ్లకే భోజనం వుండాలి.

మింగ్‌వంశపు రాజుల కాలంలో వైద్యవస్తుగుణదీపిక వ్రాసిన లీషీచెన్ మూలికల వెదకేకోసం పల్లెప్రాంతాలు తిరిగేవాడు. గణితంలో పేరుపొందిన 9వ శతాబ్దపు సూచుంగ్‌చీ ఎపుడూ స్కూళ్లకు వెళ్ళి చదువుకున్నవాడు కాదు కన్ఫూషియస్ పేద కుటుంబంవాడు, గొర్లకాపరి పిల్లడు, ఏ విశ్వవిద్యాలయాల్లోనూ చదవలేదు. సంగీత వాద్యము, విలువిద్య, గుర్రపుస్వారీ వచ్చును ఆయనకు. ప్రజలలో పుట్టిపెరిగినవాడు, ప్రజల బాధలు తెలిసినవాడు. తర్వాత ప్రభుత్వంలో అధికారి అయాడు, మేధావి అయాడు. అలా ప్రజల్నించి సంబంధాలు తెగిపోయాయి. కన్ఫూషియస్ తక్కువ కోర్సులే బోధించేవాడు. కన్ఫూషియస్ సాంప్రదాయాన్ని మనం త్రోసిపారేయ క్కర్లేదు.

స్కూలు కాలపరిమితి, సిలబస్, బోధనా పద్ధతులు పరీక్షావిధానం మార్చాలి. హానికరంగా వున్నయ్.

గోర్కీ మొత్తం స్కూల్లోవుంది రెండేళ్ళే. తను స్వయంగా చదువుకున్నాడు. అమెరికాలోని ఫ్రాంక్లిన్ పత్రికలమ్మే బాలుడు. ఆవిరిశక్తిని కనిపెట్టిన వాట్ ఒక కార్మికుడు.

ఒకరి సూచన– విశ్వవిద్యాలయంలో ప్రవేశించే ముందు కొంతకాలం పొలాల్లోనో, ఫ్యాక్టరీలోనో పనిచేయాలి.

ఛైర్మన్– లేక సైన్యంలోగాని.

ఇపుడు చాలా కోర్సులు, చాలా పుస్తకాలు. బరువు ఎక్కువయి పోయింది. కొన్ని సబ్జెక్టులకు పరీక్షలనవసరం. ఉదా॥ వ్యాకరణం. మిడిల్‌స్కూల్లో కొంత వ్యాకరణం నేర్పొచ్చు. పరీక్ష అనవసరం. వ్రాతలో ఆచరణలో క్రమంగా కావాల్సిన వ్యాకరణం అవగాహన అదే వస్తుంది.

ఒకరు– విద్యావిధానం గురించి రెండు ఆలోచనలు వున్నయ్. ఒకటి- ప్రతిదీ కూలంకషంగా బోధించాలనేది, రెండవది- సాధారణ సూత్రాలు రేఖామాత్రంగా చెబుతూ విద్యార్థి స్వీయకృషి, స్వంతంగా అర్థం చేసుకోవటం, అనేదానికి ప్రాధాన్యత నిచ్చేది. చాలాస్కూళ్ళు ప్రతిదీ వివరంగా బోధించటాన్నే జరుపుతున్నవి.

ఛైర్మన్– అది పాండిత్య ప్రకర్ష. అది నాశనమైతీరుతుంది. ఆపద్ధతిలో తయారయిన విద్యార్థులు ఏ దేశంలోనయినా దెబ్బతింటారు. పనికిరాకండా పోతారు. వారినివారే నిరుపయోగం చేసుకుంటారు.

అతిగా చదవటం అనవసరం.

మార్క్స్ పుస్తకాలు చదవాలి. అవీ మరీ ఎక్కువ అనవసరం. కొన్నిడజన్లు చాలును. మనం కోరుకునేదానికి వ్యతిరేకంగా తయారవుతాం. మరీ పుస్తకాలెక్కువ చదువుతూంటే, పుస్తకాల పురుగులుగా, మొండిసూత్ర వాదులంగా (డాగ్మాటిస్ట్) రివిజనిష్టులుగా అవుతారు. కన్ఫూషియస్ విద్యావిధానంలో పరిశ్రమలు, వ్యవసాయం విషయాలులేవు. అందుకే ఆ విద్యార్థులు శారీరక శ్రమనెరుగరు. పంటల విషయాలు బొత్తిగా తెలియదు. ఇది మనం మార్చుకోవాలి.

లెక్చర్లు దంచడం, బట్టీలు పెట్టడం చదువుకాదు.

అధ్యాపకుని కర్తవ్యం ఉపన్యాసవర్షం కురిపించటం కాదు, విద్యార్థి తనకుతానే చదువుకోగలందుకు పాఠ్యాంశం అర్థంచేసుకోగల్గేట్టు దారిచూపటం జరగాలి. ఆచరణ ద్వారా చూపిస్తూ స్వశక్తిపై ఆధారపడేవాళ్ళుగా తాము స్వంతంగా తెలుసుకోగల్గిన వాళ్లగా నడపాలి. పాఠం తర్వాత పాఠం రుద్దిపోస్తూ గంటలతరబడి లెక్చర్లుదంచటం కాదు. విద్యార్థి మనసులోనూ, హృదయంలోనూ చిత్తశుద్ధిగల జిజ్ఞాస, ఉత్సాహాల జ్వాలను వెలిగించాలి. విద్యార్థి పరిపక్వమయేది చింతన, ఆచరణ, అర్థంచేసుకొనటాల

వల్ల, అంతేగాని శారీరకంగా విలాసమైన, అనాయాసమైన జీవితం గడుపుతూ ఉపన్యాసాలు వింటూ విన్నవిబట్టీ పెట్టటంవల్లకాదు. ఎన్నిసబ్జెక్టులు పిక్కావేశాడు? ఎంత టెక్నిక్ గుర్తుపెట్టుకొన్నాడు? ఎన్ని ప్రశ్నలకు జవాబులు రాయగల్గుతాడు? అనేదికాదు, విద్యార్థి ఉన్నతిని కొలవటానికి; ఎలా ఆలోచిస్తున్నాడు, ఎలా ఆచరిస్తున్నాడు, తనవి అనుకోబడేవీ, అనుకోబడనివి అయిన అన్నివిషయాల యెడల, యింకో మానవునితో, జీవితం చుట్టూరా ప్రపంచంలో ప్రతికదలికకు ఎలా స్పందిస్తున్నాడు? ఎంతలోతుగా చురుకుగా కదలిక కనబరుస్తున్నాడు? ఇవీ చూడాల్సినవి, ఇవి నేర్పేదే విద్య.

కొంతసేపు పని, కొంతసేపు చదువు.

స్వయం పోషకం అయేందుకు వీలుగా విద్యాలయాలన్నీ సాధ్యమైనంతవరకూ కర్మాగారాలను నెలకొల్పుకోవాలి. విద్యాలయాల్లోని విద్యార్థులు కొంతటైము పనివారుగా, కొంతటైము విద్యార్థులుగా తయారవాలి. పరిస్థితులు అవకాశం కల్పించినపుడు యింకా యింకా ఎక్కువమందిని విద్యార్థులుగా చేర్చుకుంటూగూడా ప్రభుత్వానికి వ్యయం పెరగకుండా అవాలి.

వ్యవసాయ విద్యాలయాలన్నీ వాటి వాటి క్షేత్రాల్లో ఉత్పాదకకృషి చేయటమేగాక ఆ విద్యార్థులకు దగ్గరలోవున్న సహకార వ్యవసాయ క్షేత్రాల్లోకూడా పని కుదర్చాలి. ఆ స్కూళ్ళ ఉపాధ్యాయులు దగ్గర్లోని సహకార క్షేత్రాలకు వెళ్తూండాలి. సిద్ధాంతం, ఆచరణలకు అలా లంకెకుదుర్చుకుంటూండాలి. సహకార క్షేత్రాల్లోని పనిమంతులను యీ వ్యవసాయ విద్యాలయాల్లోకి విద్యార్థులుగా పంపాలి.

గ్రామాల్లోని ప్రాథమిక మాధ్యమిక స్కూళ్ళు స్థానిక వ్యవసాయ సహకార సంఘంతో పనికి ఒప్పందాలు చేసుకొని ఆ పనుల్లో విద్యార్థులు పాల్గొనాలి. గ్రామాల నుండి వచ్చి పట్టణాల్లో చదువుకొనే విద్యార్థులు వారి సెలవులలో, ఖాళీటైముల్లో వారి వారి ఊళ్ళకువెళ్ళి పొలాల్లో పనిచేయాలి.

విశ్వవిద్యాలయాలూ, పట్టణ ఉన్నత పాఠశాలలు వారి వారి కర్మాగారాలు నెలకొల్పు కొనటమో లేక దగ్గరలోవున్న ఫ్యాక్టరీలు కర్మాగారాలతో ఒప్పందాలుచేసుకొనో పనిలో పాల్గొనాలి.

భూములు వున్న విద్యాలయాల్లో వారే వారి వ్యవసాయాన్ని నిర్వహించాలి. ఆ విద్యాలయానికి భూమి లేకపోతే దగ్గర్లోవున్న పొలాల్లో ఉపయోగపడే పని చేస్తూండాలి.

డాగ్మాటిజం

విద్యావిషయంగా మనకు చాలా సమస్యలున్నయ్. ముఖ్యమైనది డాగ్మాటిజమ్ (మొండిసూత్రాల వాదం). మన విద్యావిధానాన్ని సంస్కరించుకొనే క్రమంలోవున్నాము. స్కూలు సంవత్సరాలు చాలా ఎక్కువ. కోర్సులు చాలా ఎక్కువ. బోధనా పద్ధతులు అసంతృప్తికరంగా వున్నయ్. పిల్లలు పాఠ్యపుస్తకాలు, సూత్రాలూ నేర్చుకుంటారు. అవి పుస్తకాలుగనే సూత్రాలుగనే మిగిలిపోతయ్. కాళ్ళూ చేతులకు పనికల్గించరు. వివిధ ధాన్యాలనే గుర్తించలేరు. చాలామంది పిల్లలకు ఆవులూ గుర్రాలూ, కోళ్ళూ పందులూ గురించే తెలియదు. వరి గోధుమ జొన్న వగైరాల భేదాలను గుర్తించలేరు. చదువు ముగిసేసరికి 20 ఏళ్ళకు మించే వయసుంటుంది. విద్యాబోధనా పద్ధతి "ఊహని పెంచటంకాక ఊహని దంచటం"గా వుంది.

కళలకు సమాజమే కర్మాగారం

సింఘువా యూనివర్శిటీలో సైన్సు, ఇంజనీరింగ్ శాఖలకు అనుబంధంగా ఫ్యాక్టరీ వుంది. విద్యార్థులు పుస్తకాలనించీ, పనినుంచికూడా నేర్చుకోవాలి కనక, ఆర్ట్సు విభాగాలకు ఫ్యాక్టరీలు పెట్టలేంకదా। సాహిత్యం ఫ్యాక్టరీ, చరిత్ర ఫ్యాక్టరీ, నవలా ఫ్యాక్టరీ, యిలా కుదరవుకదా. ఈ విభాగాలకు సమాజమే ఫ్యాక్టరీ. ఈ విద్యార్థులు, అధ్యాపకులూ రైతులతో కార్మికులతో సంబంధాలు పెట్టుకోవాలి.

క్రియాశీలమైనంతమేరకే జ్ఞానం అవసరం.

అతివిద్యా సముపార్జన, అతిగా జ్ఞానతృష్ణ హానికరాలు, ఆచరణకు ఉపకరించినమేరకే తోవతీసినవరకే ఆచరణతో జోడించబడినదే అవుసరంకాని, అలాకాని కేవల విజ్ఞానం, విజ్ఞానాన్ని పోగుచేసుకుంటూపోయే 'జ్ఞానతృష్ణ' క్రియాశీలతను నశింపచేయటానికి, కార్యనిర్వాహతనించి తప్పుకుపోవటానికి మానసిక అలసత్వం, శారీరక సోమరితనం పెరగటానికి దోహదంచేస్తుంది. ఆత్మస్తుతి, స్వీయతృప్తి ఆచరణ (Action) యెడల నిర్లక్ష్యాన్ని, సాధారణంగానే బూర్జువా ధోరణిని యీ కేవల విద్యార్జన తెచ్చిపెడుతుంది. ముఖ్యం ఆచరణ, ఆచరణకు వెలుగుబాట తీర్చేదీ, క్రియాశీలతను కొనివచ్చేదీ విద్య. అంతవరకే విద్యాప్రాముఖ్యత.

జార్జిరెడ్డి హత్య

ఆర్. యస్. యస్. ముఠావాళ్ళ కిరాయి గుండాలు నైతికరాహిత్యానికి పరాకాష్ఠ మనదగిన దారుణమైన పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వాళ్ళ ఫాసిస్టు పరిపాలనను సాహసోపేతంగా ఎదుర్కొని పోరాడుతున్న విద్యార్థి నాయకుణ్ని చల్లగా పిరికిరక్తంతో చంపేశారు,

జార్జిరెడ్డిని హత్యచేశారు।

ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్నికల వాతావరణం ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్‌లో ఆర్. యస్. యస్. గుండాగిరీ ఇంక ఒకళ్ళకిగా పనిచేయలేని స్థితికి వచ్చిందని మళ్ళీ ఒకసారి రుజువుచేసింది. విద్యార్థి సంస్థలలో అధికారాన్ని చేపట్టాలన్న వాళ్ళ ప్రణాళికలను ఇద్దరు క్లాస్ రిప్రజెంటేటివ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికకావటం వమ్ము చేసింది. ఎన్నో నెలలుగా భయభీతావహాలు కలిగించే వాళ్ళ ఎత్తుగడలు, విద్యార్థుల సాహసోపేతమైన ధృడసంకల్పాన్ని చెదరగొట్టలేక పోయ్యాయి. నెంబది హేను రోజుల కింద జార్జిరెడ్డిపై కత్తితో చేసిన హత్యాప్రయత్నం కూడా ఈ ఎత్తుగడలో భాగమే.

ఆర్. యస్. యస్. వాళ్ళ ఈ పిరికిచర్యను అర్థంచేసుకోవచ్చు. కాని ఈచర్య పోలీసువాళ్ళ ముందర జరగడమే చిత్రంగావుంది. ఏప్రిల్ 14 వ తేదీన ఐదారుగురు సాయుధులైన పోలీసు కానిస్టేబుల్స్ చూస్తూవుండగా ఈ హత్య జరిగింది. వాళ్ళు జార్జిని రక్షించడానికి కదల్లేదు. ఇంతకాలం నుంచికూడా క్యాంపస్ నుంచి ఆర్. యస్. యస్. ను తొలగించాలనే సమస్య విషయంలో యూనివర్శిటీ అధికారులు, పోలీసు, రాష్ట్రప్రభుత్వం కూడా ఒకవిధమైన ఉదాసీనత వహిస్తున్నది. దాని పెరుగుదలకు, దాని వినాశనకరమైన చర్యలకు వీళ్ళ మౌనమే దోహదం చేసింది.

జార్జ్ విశిష్టమైన విద్యార్థి, ప్రతిభావంతుడు, మేధావి. అతని శక్తిసామర్థ్యాలు అతని తెలివితేటలు, అతని చురుకుదనం, అతని నిర్మాణాత్మకమైన ప్రతిభ, ఈ విశ్వ విద్యాలయం చెప్పుకొని గర్వించదగ్గవి. ఐనా ఒక సామాన్యవిద్యార్థిగాకూడా అతనెందుకు బతకలేకపోవాలె? తన జీవితాన్నంతా పణంగా పెట్టి ప్రాణాలనే ఎందుకు త్యాగం చెయ్యాలె? నీవలెనే నావలెనే ఉన్నదాంతో తృప్తిపడి నిర్లక్ష్యంగా, స్వార్థంతో, మనం చల్లగా బతికుంటే చాలనేదృష్టితో సమాజంతో సంబంధంలేని జీవితం అతడు గడప లేకపొయ్యాడా? ఏది సరైందని విశ్వసించాడో దానికోసం అతడు పోరాడాడు. అన్యాయానికి అసమాన సమాజానికి, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడాడు.

జార్జి చనిపొయ్యాడు. కాని అతడు మన మధ్య బతుకుతున్నాడు. ప్రజలు అసమ సమాజంలో బతుకుతున్నంత కాలం యునివర్శిటీలో విద్యార్థులు స్వచ్ఛమైన క్రొత్త గాలులు పీల్చలేనంతకాలం ఏ ఆశయాలకోసం ఆయన తన జీవితాన్ని త్యాగంచేశాడో అవి మామధ్య నిల్చేవుంటాయి. అతడు నీకోసం నాకోసం పోరాడాడు. మనకోసం ప్రాణత్యాగం చేశాడు.

హంతకులందరు శిక్షించబడి ప్రభుత్వం ఆర్. యస్. యస్. ను రద్దుచేసేదాకా మేము విశ్రాంతి తీసుకోమని హెచ్చరిస్తున్నాం. ప్రభుత్వ యంత్రాంగం మీద ఆధార పడినందుకు మేం చాలావిలువైన మూల్యం చెల్లించాల్సివచ్చింది. లక్షలాది జార్జిరెడ్లు విద్యార్థి సమాజం లోంచి ఉదయించి అన్ని ఫాసిస్టు శక్తులను, తిరోగమన శక్తులను ఎదిరించి పోరాడేరోజులు మొదలైనవి.

ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్
ఉస్మానియా యూనివర్శిటీ.

జిందాబాద్!

చావుకూడ బతుకుకన్న విలువైన త్యాగంగా
చచ్చినవానికోసం ఏడ్వరాదు.

బతుకు ఒక అవమానాల చీము పుండుగా
బానిసత్వం ఒక వారసత్వ వ్యాధిగా
పిరికితనం నెత్తుటి స్వభావంగా
బతుకుతున్నవాళ్ళు రోజూ చస్తూనేవున్నారు.

తన తరమంతా సుఖంగా బతకడానికి
ఒకడు ఒకరోజు ముందు చస్తాడు.

చాలమంది బోధకులు వచ్చిపోయారు దేశంలో...
గిరిజనుల హృదయాల్లో మండుతున్న
బాధల సత్యాన్ని, ప్రతీకార సత్యాన్ని
బాణంలా విల్లుమీద గురిపెట్టిన సత్యాన్ని
చచ్చినా చచ్చిండని ఒప్పుకోదు జనం.

చంద్రగ్రహణం రోజు సముద్రస్నానాల్ చేసి
నోబెల్ ప్రైజులుపొందిన శాస్త్రవేత్తలు
సాయిబాబాల కళ్ళల్లో, జూలులో, కాలిధూళిలో
ఆత్మపరమాణు పరిశోధనలు చేస్తున్న
భౌతికశాస్త్ర సూర్యులూ వున్నారుమనకు...

జ్ఞానమంటే అన్యాయాన్ని అంతకన్న
తీవ్రంగా ఎదుర్కోవడమని తెలిసిన
జార్జ్ రెడ్డిని మాత్రమే
శాస్త్రవేత్తగా గుర్తిస్తుంది జనం.

కాకతీయుల గుళ్లు కూలిపోతున్నయ్

జి. మిత్రా

కాకతీయుల కాలంనాడు, కొన్నివందల సంవత్సరాల క్రితం, మహోన్నతంగా చెక్కిన రాళ్ళు, గుళ్ళమీద గోపురాలమీద మహాసంస్కృతిగా నిలిచిన శిల్పాలు కూలి పోతున్నయ్.

హనుమకొండలో వేయిస్తంభాల గుడి బాగా వాలిపోయింది. పాలంపేటలో రామప్పగుడి చాలవరకు నాశనమైపోయింది. వరంగల్లులో స్వయంభూదేవాలయం దాదాపు నామరూపాలు లేకుండాపోయింది. గనపూరులో, పానగల్లులో, తోగ్గూడెంలో, యింకా ఎన్నోచోట్ల, కాకతీయులు కట్టించిన కళావైభవాలు అనుకునే యీగుళ్లు కూలి పోతూనేవున్నయ్.

కూలుతున్న గుళ్లలో శిల్పాలుకూడా రాలిపోతున్నయ్. హంసలు, ఏనుగులు నాట్యం చేస్తుంటే దిబ్బడిగుబ్బలదిరే మదవతుల ఊపులూ. ఆ ఊపులకు దోళ్లకాద్దే వాయిజ్యగాళ్ళూ, తోరణాలుగా అలంకరించిన బిగిపట్టులోవున్న కామక్రీడల శిల్పాలూ కూలిపోతున్నయ్.

నల్లరాళ్ళను నవనీతంకన్నా మెత్తగా మలిచి నిలిపిన కాకతీయుల్ని, వాళ్ల కళా పిపాసను కూలిపోకుండా నిలబెట్టండని గావుకేకలేస్తున్న పాత సంస్కృతి ఉద్ధరణ పండితులకు, యీ కూలినరాళ్లు, పగిలిన బోసిమొల బొమ్మలు, అరిగిన అర్ధనగ్నపు సాలబంజికలు చాలకాలంగా రచనా వ్యాసంగానికి వస్తువును సమకూరుస్తూ వచ్చినై.

సంస్కృతిని ఉద్ధరించే యీరాళ్ల పండితులు, గుడి విమర్శకులు, గోపుర రచయితలు యీ మధ్య కొత్తశైలితో, కొత్తపదాలతో, పాతసారాని అమ్మటానికి తంటాలు పడుతున్నారు. యీ రాళ్ళన్నీ మన సంస్కృతని, మహోన్నతమైందని, ప్రపంచానికి చాటగల సీటు నిక్కి దీనికున్నదని, అందునా ఆంధ్రుల వైభవమని, విశిష్టమని, మనం గర్వించగల కళాఖండాలని ప్రచారం చేస్తున్నారు.

సారస్వతంలో వచ్చిన విప్లవభావాలు, పోకడలు, యీ లలితకళలనబడే చిత్రం, శిల్పం, సంగీతం, నాట్యంమీద రాలేదు. ఎందుకంటే యివి సామాన్య జీవితానికి దూరంగా ఉండటమేగాక వీటిని సృష్టించటానికి ఉపయోగించే వస్తువులు, నేర్పరితనం, కొందరివరకే పరిమితం చేస్తున్నయ్. కలం కాగితం వుంటే రచనచేసి, ప్రచురణ

చేయడానికి ప్రెస్సు లభ్యమవుతున్నట్లుగా, ఉలి, షాణం, రంగులు, కుంచెలు, సితారు పట్టుకుని, కళను ప్రచారం చేయడం కొంతవరకే వీలుపడుతోంది.

యీ కళలు, ముఖ్యంగా శిల్పకళ యిప్పటి జీవితంలో చాల చిన్నపరిధిలోనే వుండిపోయింది. ఒకప్పుడు యీ కళను రాజులు పోషించారు. యీ ఒక్క శిల్పకళనే కాదు, అన్నికళల్ని రాజులు పోషించారు. రాజులు పోషించిన ఆ కళలన్నిటిని, ప్రస్తుత ప్రజల సంస్కృతిగా ముద్రవేస్తూ కళావిమర్శకులు ప్రచారం చేయడం సముచితం కాదు. కాకతీయుల శిల్పాలు, విజయనగర శిల్పాలు, గుళ్లు, గోపురాలు మనకళలనుకునేముందు, మనమేకాలంలో ఉన్నామో, ఏ ఉద్దేశాలతో బ్రతుకుతున్నామో, ఏ ఉద్దేశాల్ని ప్రచారంచేస్తే దోపిడి, దుర్మార్గం, ఆర్థిక అసమానతలు, బీదరికం, మతం, కులం, కక్షలు సమూలంగా నాశనమౌతాయో, ఆ ఉద్దేశాలకూ యీపాత కళలకు సంబంధమేమిటో ఆలోచించాల్సిన తరుణమిది.

ప్రతి శిల్పం యొక్క పుట్టుపూర్వోత్తరాలు, తెలుసుకోవడం, ప్రతి గుడియొక్క సృష్టికర్తల్ని మెచ్చుకోవటం, గుళ్లుకట్టిన రాజుల్ని, కళోద్ధారకులని పొగడటమేగాక వీటిని ప్రజలర్థం చేసుకోనిదే అసలు కళలంటే ఏమిటో అర్థంగాదని వాదిస్తున్నారు కొత్త విమర్శకులు. గుళ్లు ఎలాకట్టారో, ఏ ఏ వ్యాకరణ సూత్రాలతో నిర్మించారో, ఏ ఏ పురాణాల్లో యీ సూత్రీకరణ జరిగిందో తెలియజేయటానికి బూజుపట్టిన పురాణాల్లో సాలీడు గూళ్లను లెక్కపేయడానికి పూనుకొని, యీ పరిశోధన ఫలితాలే కళనుగూర్చి సాధికారంగా చెప్పటమన్నంతవరకు పోటీలుపడుతూ రాస్తున్నారీమధ్య. యీ కళల యొక్క గొప్పతనాన్ని చెప్పేముందు యీ కళలయొక్క ప్రయోజనం తేల్చుకోవాలి.

ఏ ప్రయోజనం కోసం యీ కళల్ని సృష్టించారు? ఏ వర్గం యొక్క ఆనందం కోసం ఉద్దేశించబడినవీ కళలు?

ఏ రాజులు ఏమతాన్ని పోషిస్తూ, ఎవర్ని నాశనం చేయాలని ఉద్దరించారీ కళలు? కాకతీయులెవరు? ఎందుకోసం కాకతీయులు యీ కళల్ని పోషించారు?

వర్గసంఘర్షణ బాగాపెరిగి పోరాటాలుదాకా సాగే యీ రోజుల్లో యీ కళలయొక్క విలువేమిటి?

పోరాటాలకు, పోరాటదృక్పదానికి యీకళల ఔన్నత్యానికి ఎలాటి సంబందాన్ని తీసుకోవాలి?

అనే ప్రశ్నలు వేసుకుంటే మనకు తేలేది— యీకళలు సమాజంలో అట్టడుగున ఉన్న శ్రామికజనానికి, కూలిజనానికి దోపిడి చేయబడే జనానికీ, బాదపడేవాళ్ళకు, వాళ్ల

జీవితానికి సంబంధించిం దెంతమాత్రం కాదు. వాళ్ళ శ్రీమఫలితం వాళ్ళకందకుండా పోయే సమాజనిర్ణయాల్ని స్థిరస్థాయిగా చేయాలని ప్రయత్నంచేసే మతాలు, దేవుళ్ళ, కర్మలు, వేదాంతాలను చిత్రించిన శిల్పాలు ఏవిదంగానూ మానవత్వానికి చిహ్నాలు కావు.

కూలివర్గం జీవితాన్ని మెరుగుపరచటానికి చేసే పోరాటానికీ అవాంతరంగా ఉన్న ప్రతి దృక్పథమూ చావాల్సిందేనని కోరుకునే యీరోజుల్లో, యీకళలు నాశనం కావాలనే కోరుకుంటాము.

శ్రమవర్గానికి సంబంధించని కళావిమర్శకులు యీకళలు పోషించబడాలనే కోరుతారు. వాళ్లదోపిడివర్గ ప్రయోజనాన్ని వాళ్ల ప్రచారంచేయడం వాళ్లకు సబబుగానే కన్పించవచ్చు, కాని యితరులకు కాదు.

యీకళల్ని ఉద్ధరించాలనే మహనీయులు మరోవాదనకూడా చేస్తారు— 'యీ కళల్ని నాశనంచేసి ఏ నిర్మాణం చేస్తారు? నిర్మాణాత్మకమైన సరైన విధానం రానంత వరకు వీటిని నాశనం చేయాలనటం పొరపాటుకాదా?' అంటారు.

శ్రామికవర్గ ప్రయోజనం దృష్టితో చూచినప్పుడు వీటిని నాశనంచేయాలి. ఆవర్గ ప్రయోజనం కోసం జరిగే పోరాటాలకు రూపంకల్పించే కళలే కళలవుతవి. యీచెడును తీసివేసుకోటానికి కాలవ్యవధి అనవసరం. అందాక ఏదోకళంటూ ఉండితీరాలనే మొండి అవసరం లేకపోతే, ముందు యీ పనికిమాలిన కళల్ని నాశనం చేయాలి అని కోరుకోవటంలో తప్పేమీలేదు. యివి వర్గపోరాటాల్ని తిరోగమనం చేస్తయికనుక.

మరోవాదం, కాకతీయుల కాలంనాడుకాని, మరోరాజుల కాలంనాడుకాని శ్రీమజీవుల పోరాటాలులేవు. యీవర్గ చైతన్యం అప్పుడులేదు, కాబట్టే వాటిని చిత్రించి ఉండరు అని. రాజులు పోషకులై నిర్మించే కళలకు వర్గసంఘర్షణ రూపంరాదు. ప్రతి వర్గం వాళ్ల వర్గప్రయోజనాలనే చూస్తుంది.

చరిత్రలో రాచరికాలు, మతాలు, దోపిడీని పంచుకునే పరిస్థితులు రకరకాలుగా మారుతూ వచ్చాయి. అయి దోపిడీవర్గాల మార్పుల స్థితుల్నేవర్ణిస్తూ యీకళలొచ్చాయి. అప్పుడు ఏ శ్రామికులో తమపక్షాన కళానిర్మాణం చేయనంతమాత్రాన ఆ కాలంలో దోపిడీలేదని కాదు. సమాజంలో దోపిడీ జరుగుతున్నదని బాగాతెలిసిన యీ రోజుల్లో కూడా దోపిడి విధానాన్ని వ్యతిరేకిస్తూ కళాసృష్టి బాగా జరగటంలేదు. ఎక్కువగా ఉన్నవాళ్ల సంస్కృతిని నిలబెట్టటానికిసాగే కళాపురోగమనమే సాగుతోంది. యివ్వాళ 'బ్లూ పెయింట్సు' అనబడే దిగంబరమైన బొమ్మలు, అందునా ఆడవాళ్లవి, పూర్వం దేవాలయాల గోడలమీద గుడ్డలులేని సాలబంజికల బొమ్మలకు తేడా ఏముంది?

ఏదోకొత్త చూపించి రసాత్మకం చేయాలని చేసే సర్కస్ పీట్సుకళలనుకోవటం ఉన్నవాళ్ల సంస్కృతియొక్క పురోగమన చిహ్నం. కొత్తకావాలి; కొత్త అనుభవించాలి; ఎందుకు, ఏమిటి అనే సమాజవిచక్షణ అనవసరం. వ్యక్తిపరంగా కళాత్మకదృష్టి కావాలి, వ్యక్తిరసికత పెరగాలి, అనేవాటికి రూపాలే యిప్పుడు వస్తున్న చాల కళా ప్రయత్నాలు.

జరిగిన పరిస్తితుల్ని, చరిత్రను సమీక్షించటమో, విశదీకరించటమో (analysis) చేసినంతమాత్రాన కళావిమర్శకాదు. దృక్పదంలేని వివరణలు, ఫొటోగ్రాఫిక్ సిన్సియారిటీలు, పనికిరాని రియాలిటీ మాత్రిమే అవుతయ్.

దృక్పదం కూడా వర్గసంఘర్షణ దృక్పదం కానప్పుడు ఎంత వివరించినా కళల్ని, చరిత్రని, సమాజ పురోగమనానికి ఉపయోగపడవు. యీ తప్పిదాన్ని అభ్యుదయవాదులనుకున్న రచయితలు, విమర్శకులు చాలమంది చేస్తున్నారు. 'లోకాయత'ను అనువాదం చేసిన పురాణం సుబ్రమణ్యశర్మగారి రచన యూనివర్సిటీ విద్యార్థుల కుపయోగపడినట్టుందికాని, దానినుండి మనకో వర్గదృక్పదాన్ని పెంచటానికి ఆస్కారం కల్గించలేదు.

'వేదాలలో ఏముంది?' అని రాసిన కొడవటిగంటి కుటుంబరావుగారు, వేదాల్ని, వేదకాలపరిస్థితుల్ని వివరించారు. ఆ పనిని భవన్స్ జనరల్ వాళ్లు చాల బాగాచేశారు—'వేదిక ఏజ్' అని 'క్లాసికల్ ఏజ్' అని పుస్తకాలు రాశారు. యీ వేదాలవలన మనకేం ఉపయోగమో, ఏమనవసరమో రాయలేదు. వేదాలపై వర్గదృక్పద మేమిటో ఆయన రాయలేదు

ముందు విషయం మీద వివరాలు సేకరిస్తే అలా విషయం తెలుసుకున్నాక, దృక్పదం అలవర్చుకోవచ్చనే వారున్నారు. వీళ్లదృష్టిలో భారతం చదవనిదే, కవిత్వం రాయలేమని, నిజంగా వారి ఉద్దేశ్యమదే అయితే విషయవివరణ రాసాక ఆ విషయావసరం, వర్గదృక్పదం కూడా. అన్నీ ఒకేసారి రాయాల్సి ఉంటుంది. వివరణ ఒక పుస్తకంగానూ, వివరణచేసే వారొకరుగానూ, ఆ వివరణను వినియోగించుకొని దానికి వ్యతిరేకంగా వర్గదృక్పదంతో విమర్శించే మరొక పుస్తకంగానూ రాయాలంటున్నారు. ఒక్క రచయితే రెండుపనులూ రెండుపుస్తకాలుగా రాయలేదింతవరకు.

తాపీ దర్మారావులాంటి వారు దేవాలయాలమీద బూతు బొమ్మల వివరణచేస్తూ, ఒక దృక్పదంకూడా యిచ్చారు. దృక్పదం, వివరణ రెండుగా ఉండకూడదు, రెండు కావు అని చెప్పటానికే యివి ఉదహరించాను.

వర్గదృక్పదంతో చూస్తే యీ దేవాలయ సంస్కృతి, కళలు, ఒకనాటికి నాశనం కావాల్సిందే. కాకతీయుల గుళ్ళు కూలాల్సిందే కాకతీయుల శిల్పాలుకూడా నాశనం కావల్సిందే. వాటిని పునరుద్దరించటానికి ఏవిధంగా ప్రయత్నించినా అది కానిపని. అని గుడి విమర్శకులు తెలుసుకోవాలి.

గతం తెలియనిదే జరుగుతున్నది అర్థంకాదని, భవిష్యత్‌ను నిర్మించటానికి కూడా గతాన్నిగూర్చి తెలుసుకోవటం చాల అవసరమని చాలమంది చెబుతారు. సంజీవదేవ్, రాజమన్నార్ లాంటి కళావిమర్శకులు యీగుళ్ళు, గోపురాలు, అంతఃపురాలు, శిల్పాలు, కళలనీ, గత సంస్కృతి చిహ్నాలనీ, కనుక వీటిని తెలుసుకుంటే గత సంస్కృతిని అర్థంచేసుకో గలుగుతామని అంటారు. యీ 'గతం తెలుసుకోవాలి' అనేవాళ్లు, గతాన్ని ఏ ఉద్దేశ్యంతో, ఏదృక్పదంతో, ఎందుకు తెలుసుకోవాలో కూడా ఆలోచించాలి ఆ దృక్పదం లేకుండా గతం అందరికీ ఒకేవిదంగా అర్థంకాదు. ఒక్కో వర్గానికి గతం ఒక్కోవిదంగా అర్థమౌతుంది. ఆ వర్గప్రయోజనం కోసం గతాన్ని విమర్శించుకుంటూ పోతారు. వర్గసంఘర్షణ, దృక్పదంలేకుండా గతాన్ని మనం ఎంత తెలుసుకున్నా, ఏదేశం చరిత్రి చూచినా, ఏరాళ్ల సంస్కృతిని చూచినా, ఏ దేవుళ్ళ కళల్ని సిద్ధాంతీకరించినా, అన్నీ ఒకవిదంగానే ఉంటయ్. రాజుల కళాపోషణలాగానో, మతోద్దరణలాగానో, బూతు సంస్కృతిలాగానో కవిపిస్తయ్.

కాలేజిల్లో, అకాడెమీల్లో, పి. హెచ్. డి. కోసం, అవార్డుల కోసం ప్రియత్నం చేసే అశేష జనాభ్యుదయవాదులు, చరిత్రిను వర్గదృక్పదం లేకుండానే చదువుతున్నారంటే, మనమాశ్చర్యపడాల్సిం దేమీలేదు. డాక్టరేట్ తీసుకున్న పండితులు, శాస్త్రకారులు, విగ్నానులు, కళావిమర్శకులు ఎక్కువలో ఎక్కువ మంది విషయాల్ని నిష్పామంగా, నిష్పక్షపాతంగా, రాయటమే గొప్పగాతీసుకొని ఫొటోగ్రాపిక్ సిన్సియారిటీతో ఏం జరిగిందో వివరణచేస్తారుకాని శ్రమజీవుల కుపయోగపడే దృక్పదంతో రాయరు.

వర్గదృక్పదంలేని గత వస్తువిమర్శలుగాని ప్రిస్తుత విమర్శలుగాని నిజాన్ని తేల్చవు. ఎందుకంటే ప్రితిపని, ప్రతి విషయం, ప్రితికళ, ప్రతిరచన, ప్రితివాదం వర్గప్రయోజనం లేకుండా జరగటంలేదు కాబట్టి, జరగలేదు కాబట్టి.

"క్రూరమృగం నిన్ను పట్టుకు తింటోంది. కదిలే కల్లోలం తప్పదు కదా! కదలకుండా భోంచేయనియ్. అదేనా నువ్వు కోరే శాంతి.

బాకో, చాకో చూపి దోపిడిదొంగ నిన్ను దోస్తాడు- తిరగబడితే రక్తపాతంతప్పదు. అంచేత కిక్కురుమనకు, అదేనా నువ్ చెప్పే శాంతివాదం."

కా. రా.

భారతీయ తత్వశాస్త్రం - ఒక పరిశీలన

'ప్రజల చారిత్రిక దశలకు సంబంధంలేని తాత్విక చర్చలు మార్క్సిజానికి విరుద్ధం'

నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

కప్పంచెల్లించి, కొల్బరికాయలు కొట్టితేగాని, వ్యక్తిగా స్వేచ్ఛ పొందే వీలులేదిప్పుడు. ఓడిపోయిన తెగలు, లేక వ్యక్తులు జీవితాంతం గెల్చినవారి స్వాధీనమే. దీని తాత్విక పరిభాష 'భక్తి' బ్రాహ్మణ యజ్ఞ సంస్కృతి, బౌద్ధుల 'భక్తి' సంస్కృతిగా పరిణామం చెందించబడింది. ఇది అభివృద్ధిచెందుతున్న రాచరిక ప్రభుత్వాలకు అత్యవసరం. ఇదే మూర్తిగారు చెప్పే "పాతవ్యవస్థను, పాతసిద్ధాంతాలను, కట్టుబాట్లను ఖండించి, నూతన సమాజనిర్మాణానికి వేగుచుక్కగ పనిచేసే ఒక వుద్యమం, ఒకశక్తి, ఒక నాయకుడు అవసరమైనాడు. సాంఘిక, తాత్వికరంగాలకు సంబంధించినంతవరకు, బౌద్ధమతం ఈ చారిత్రిక బాధ్యతను నిర్వహించింది" (పే. 46) బౌద్ధం భారతజాతికి చేసిన మహోపకారం ఇదే. (పే 70) బౌద్ధమతంగాని, మరేమతంగాని ప్రజలకు 'మహోపకారం' చేస్తుందని చెప్పటం సరికాదు. మతం మానవజాతికి 'మత్తుమందు' లాంటిదని మార్క్స్ చెప్పినదానికిది పూర్తిగ వ్యతిరేకం. ఇదే మార్క్సిజాన్ని రివైజ్ చేయబూనటం.

'పుట్టుక' అనేది గౌతముని ప్రకారం మహాపాపం. గతి తార్కిక భౌతికవాదం ప్రకారం అది విప్లవం. అది అభివృద్ధి. గౌతముడు ఈ అభివృద్ధిని కోరలేదు. 'నిర్వాణ' లేక 'మోక్షాన్ని' కోరాడు. అది 'అంతం' (Ending) ఈ రెంటినికలిపి ఈ రచయిత ఒక వైరుధ్యంలో ఇరుక్కున్నాడు. ఈ క్రింది పరిశీలన గమనించండి,

భావ, భౌతికవాదుల్ని విడదీయటానికి ఏంగిల్సు మనకొక గీటురాయినందించి ఒక శతాబ్దం దాటిపోయింది. దీనిప్రకారం, పదార్థం ప్రాథమికమని అంగీకరించేవారందరు, వివిధరకాల భౌతికవాదులు, చైతన్యం ప్రాథమికమని వాదించేవారందరు వివిధ రకాల భావవాదులు.

గౌతముడు పదార్థం ప్రాథమికమని ఏనాడూ అంగీకరించలేదు, పైగా చైతన్యం ప్రాథమికమని పదే పదే అన్నాడుకూడా. ఈ విషయం మూర్తిగారుకూడ అంగీకరిస్తున్నారు.

"పదార్థం ప్రాథమికమని అంగీకరించకపోయినా, పదార్థం వాస్తవమని బుద్ధుడు, బౌద్ధధోరణులు అంగీకరిస్తున్నాయి. పదార్థం ప్రాథమికమని అంగీకరించడమంటే, తిరిగి మరొక స్థిరవస్తువు ప్రపంచ పరిణామానికి మూలమని భావించటమే ఔతుందని గౌతముని భావం. (P. 68)

ఇంత పరిశుభ్రింగ కన్పించే విషయాన్ని, మూర్తిగారు ఎలా వ్యాఖ్యానించారో గమనించండి. "గౌతముడు ప్రవచించిన ఆది బౌద్ధమతాన్ని భావవాదమనిగాని భౌతిక వాదమనిగాని నామకరణంచేయటం సరికాదు. ఈ రెంటికి మధ్యమార్గంలో భౌతికవాదానికి సన్నిహితమైన 'గతి తార్కిక హేతువాద' ధోరణిగ భావించవచ్చు. (P. 69)

గౌతముని కాలంలో, చార్వాకుల భౌతికవాదం మంచి ప్రచారంలోవుందని గుర్తుంచుకుంటే, గౌతమునిభావం, మూర్తిగారిభావం అభివృద్ధి నిరోధకం ఔతాయని చెప్పక తప్పదు. దీన్ని గతి తార్కికదృష్టిగ మార్చటంకొరకు (రివైజు జేయుటకు) ఈ రచయిత గౌతముని ప్రధాన ప్రాథమిక సూత్రాల్లో ప్రథమసూత్రమైన "జీవితమంతా దుఃఖమయం" అనేదానికిక్రింది భాష్యంచెప్పాడు.

"దుఃఖం"అంటే శోకంకాదు. వ్యక్తిలో, సమాజంలో, ప్రకృతిలోని, దృగ్విషయాలన్నిటిలోనున్న విరుద్ధశక్తుల కలయిక, సర్వవ్యాపితమైన ఈ వైరుధ్యాన్నే గౌతముడు 'దుఃఖం' అని వాడాడు. (P. 56)

దీన్నిబట్టి మూర్తిగారు 'వైరుధ్య సూత్రాలనుకూడ రివైజు చేయబూనుకున్నట్లు స్పష్టపడుతోంది. గౌతముని 'జీవితమంతా దుఃఖమయం' (Misary is the law of life) కున్నూ, వైరుధ్యసూత్రాలు (Laws of Controdiction) కున్నూ ఉత్తర, దక్షిణ దిక్కులకున్న సంబంధం.

ఒక జీవిలో వైరుధ్యము అంటే,— వృక్షము, జంతువు, మనిషి మొదలగునవి (Organisms) - ఆజాతులను (Specis) మరికొన్నిటిని సృష్టించి, ఆ జీవి అంతం కావటం.

ఒక సమాజంలో వైరుధ్యము అంటే, వర్గపోరాటం ద్వారా అభివృద్ధివైపు ప్రయాణించటం.

ప్రకృతి దృగ్గోచరాల్లో వైరుధ్యము అంటే (organic matter) వ్యతిరేకశక్తుల కలయికద్వారా అభివృద్ధి (Multiplicity of things)

కనుక వైరుధ్యము అంటే అంతర్గత, బాహ్యఘర్షణలతో అభివృద్ధికి, ఇంకా అభివృద్ధికి దారితీసే మూలసూత్రం, గౌతముని 'దుఃఖం'కూడా యిలా అభివృద్ధికి నడిపించేదేనా? ఐతే జీవితం 'నిర్వాణ'తో 'అంతం'అని ఎలా ప్రకటించగలడు?

వాస్తవానికి గౌతముడు అభివృద్ధి ఔతున్నదానికి, అంతర్ధానమౌతున్నదానికి భేదాన్ని గమనించలేకపోయాడు. విచ్ఛలీ సమాఖ్యగురించి ఆయన అభిప్రాయాల్లో ఇది తేలిపోయింది. రావిచెట్టు బునాదిగా గర్భస్థబీజాన్ని ఆలోచించాడు. ఈబీజాన్ని

నశింపచేస్తే- పుట్టుట, ముసలితనం, చావు- పరిణామచక్రాన్నే ఆపుచేయవచ్చు అనే నిర్ణయానికొచ్చాడు. మానవ జీవితంలోని బీజం 'కోర్కెలు' వాటిని నశింప చేస్తే, మోక్షం. తిరిగి ఈ పాపంలోకి పుట్టే అవసరమే వుండదన్నాడు.

కాని మూర్తిగారు ఒక తప్పును కప్పిపుచ్చటానికి మరోతప్పుచేయాల్సిన అవసరం కల్గింది. 'నిర్వాణ' అంటే బుద్ధుని భావనలో మోక్షం కాదట. "రాగ, ద్వేష రహితమైన మానసిక స్థితి, ప్రతి వ్యక్తి అట్టి స్థితిని పొందుటకు కృషిచేయాలని గౌతముడన్నాడట. (P. 69)

రాగ ద్వేషాల మానసిక వైరుధ్యాలు- యీ రెండు రద్దయినతదుపరి మరల 'నిర్వాణ' పొందాలనే 'కోర్కె' ఎలా వుత్పన్నమౌతుంది? మానవుని రాగమో, లేక ద్వేషమో, ఏదో ఒక మానసికస్థితినే 'కోర్కె' అంటారు. 'కోర్కె'లే అంతం చేసుకోవాలనే 'కోర్కె' గౌతమునిదా? బలరామమూర్తిగారిదా? ఇది 20వ శతాబ్దపు అరవిందుని ఆలోచనను తీసుకపోయి గౌతముని కంటగట్టడమే. లేనియెడల కోర్కెలంటూ వుండరాదనుకున్న గౌతముడు, తన జీవితమంత వెచ్చించి, రాత్రింబవళ్లు కాలినడకతో జాతి జాతివద్దకు తిరిగే అవసరం ఎందుకు కల్గింది? బ్రాహ్మణకులంపై ద్వేషం, స్త్రీలను తన సంఘంలోనికి చేరనివ్వరాదనే ఆంక్షలు, బానిసలను వీరైనంతత్వరలో వదలిపెట్టాలనడం, రాగ ద్వేష రహిత మానసికస్థితి ఔతుందా?

'పునర్జన్మ' సిద్ధాంతం గౌతమునిచే కనిపెట్టబడ్డట్లు, బౌద్ధమతస్తులు సగర్వంగ చెప్పుకునే విషయం. ఇది బుద్ధుని భావమేకాదని బలరామమూర్తిగారు బహుసుళువుగ తోసిపారేశారు. కాని 'పునర్జన్మ' లేనియెడల 'మోక్షం'ప్రశ్నే ఉదయించదు. దానితో బౌద్ధమతమే కుప్పలా కూలిపోతుంది.

బ్రాహ్మణమత అభివృద్ధే బౌద్ధమతం.

భారతీయ తత్వశాస్త్ర రచయిత, హిందుమత భావవాదంపై, బౌద్ధమతపు గతి తార్కికదృష్టి పెద్ద విప్లవకరమైన మార్పు అని చిత్రించాడు. బౌద్ధమతంవల్ల భారత జాతికి మహోపకారం జరిగిందని, అది నాటి చారిత్రకవసరమని నమ్మించటానికి ప్రయత్నించాడు ఇది కేవలం తప్పు.

బౌద్ధ మతం అనేది నిజానికి మగధ జాతి పాలకవర్గాల తయారీ (made in Magadha) అంటే తప్పుకాదు. చార్వాకుల భౌతికవాదాన్నెదుర్కోటానికి ఆ వర్గాలకొక మతం అవసరమైంది. ఆ అవసరం బౌద్ధమతంతో తీరినందున, దాన్ని పెంచి, పోషించి, అభివృద్ధిలోకి తెచ్చారు.

మగధ, కోసల జాతులలోని ఉత్పత్తిశక్తుల పెంపుదల కనుగుణంగ ప్యూడల్ పరిశ్రమాభివృద్ధి, గౌతమునికిముందే ప్రారంభమైంది. ఆ వుత్పత్తి సంబంధాలకను గుణమైన రాచకీయవిధానాన్ని కూడ వారేర్పరుచుకున్నారు.

ఈ స్థితిలో గౌతముడు, జ్ఞానానికి ప్రధానస్థానం యిచ్చిన బ్రాహ్మణమత ఆలోచనతో రంగంమీద కొచ్చాడు. జ్ఞానాభివృద్ధికి పాటుబడి బ్రాహ్మణులవద్దకు తాను పోయాడు. తనవద్ద కాహ్వానించాడు. మహాకాత్యాయనునిలాంటి వేదపారంగతులైన బ్రాహ్మణుల్ని తన సంఘంలో చేర్చుకున్నాడు. భౌతికసంపదలకోరే బ్రాహ్మణులను దుయ్యబట్టాడు. కాని బ్రాహ్మణ్యంజోలికేనాడు పోలేదనేది గమనించదగ్గ విషయం. అలాగే క్షత్రియుల ఆస్తిని పోగుచేసుకోటాన్ని నిరసించలేదు.

బుద్ధుడు స్వయంగ యిలా చెప్పాడు. "బౌద్ధమతమే ప్రాచీన ఆర్షమతమున కెక్కువ చేరువయైనది. ఆర్షమత ప్రాచీనతను కాపాడుటకే నేను బౌద్ధమతమును బోధించితిని. "హిందు దశావతారాల్లో 'బౌద్ధావతార'మొకటి అని గుర్తించుకోవాలి.

శ్రీ బాలగంగాధరతిలక్ తన గీతారహస్యంలో ఇదేవిషయాన్ని చెప్పాడు.

"బౌద్ధమతం బ్రాహ్మణ ఆలోచనయొక్క పొడిగింపే. దాని అంతంలో అది హిందు ఆలోచనతో కలసిపోవుటద్వారా ఇది రుజువైపోయింది. మన పురాతన ఆర్య సాంప్రదాయాలు కాపాడుటకై వివిధ ఆచార వ్యవహారాలను (treditions) సాంఘిక వ్యతిరేక విధానాలనుండి కాపాడుటకై, బ్రాహ్మణకల్తీని (adulteration) నివారించుటకై నేనీవిషయం చెబుతున్నానని గౌతముడే స్వయంగ అన్నాడు.

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణగారిలా అన్నారు "అధునాతన హిందుమత స్థాపకుడు గౌతమబుద్ధుడే."

బౌద్ధపండితురాలైన శ్రీమతి రైస్‌డేవిడ్స్ ఇలా వ్రాసింది. "నా దేవుడు నేనే. నా అస్తిత్వమే దేవుడు. (తతంగత) ఈ మూలసూత్రంతో బ్రాహ్మణ మతబోధలను వ్యాపింపచేస్తూ బౌద్ధమతం ఆవిర్భవించింది."

'పురాతన భారతదేశంలో బానిసత్వం' అనే పరిశీలకవ్యాసం (Thesis)లో దేవరాజచవన M. A. Ph. D. గారిలా వ్రాశారు. "హిందు, బౌద్ధగ్రంథాల్లోను ఆరెండు మతాల్లోను, అంతర్గత ఐక్యతవుంది, ఈ రెండు మతాలు ఒకేరకమైన సాంఘిక పని విభజనను ఆమోదించాయి. (Social division of labour) ఆ ఫలితాలను పంపిణీ చేయుటలోకూడ రెండూ ఒకటే. కర్మసిద్ధాంతము. చెడ్డపనులకు అనుభవించవలసిన శిక్ష, పుణ్యకార్యాలవల్ల లభించు పునర్జన్మలనుగురించి, వీటిలో భేదాభిప్రాయాలు లేవు. ఒకే కాలానికి చెందిన వీరి సాహిత్యమూ, ముఖ్యంగ సామాజిక న్యాయసూత్రాలు. ధర్మ సూత్రాలు ఒకటిగానే వున్నాయి. ఏవైనా భేదాలుంటే సాంఘికమార్పుల కనుగుణంగ ఇద్దరూ మార్చుకున్నారు."

(సశేషం)

సమీక్ష :

పిపీలికాది బ్రహ్మ పర్యంతం

బాకీ కథలు— రచన : రాచకొండ విశ్వనాధశాస్త్రి, నవోదయ ప్రచురణ

పిపీలికమంటే చీమ బ్రహ్మ అంటే ఆహారమూ, భౌతికసంపదా (అని నిఘంటుకం) పిపీలికం ఆత్మజ్ఞానం కోసం తిరుగుతుంటే బ్రహ్మ సర్పం రూపంలో, "నువ్వు ఈ లోకంలో ఒకానొక తుచ్ఛపు కష్టజీవివి" అని చెప్పిందిట. దాంతో పిపీలికానికి జ్ఞానోదయమై, సాటి తుచ్ఛపు కష్టజీవులను కూడగట్టుకొచ్చి బ్రహ్మధరించిన పాము రూపాన్ని నిర్మూలించి పిపీలికం బ్రహ్మైక్యం సాధించిందట!

ఈ ఆధునికోపనిషత్తు రచించిన ఆధునిక ఋషి రా. వి. శాస్త్రి. ఇది మొదట చదివినప్పుడు నామనస్సు ఆర్క్‌లైట్‌లాగా వెలిగింది. నేనేగాక ఇంకా అనేకవందల మంది మనస్సులు ఇలాగే వెలిగాయని తెలిసినాక నాకు చాలా ధైర్యం వచ్చింది. నేను ఒంటరితనం భరించలేని పిరికివాణ్ణి. "కదిలేదీ, కదిలించేదీ" లాగే "వెలిగేదీ, వెలిగించేదీ"కూడా సాహిత్యానికి గొప్ప ఆభరణం. వెలుగులో కదలటం సులువుగద.

ఇలా వెలుగుతూ వెలిగించే కథలు ఈ పుస్తకంలో పన్నెండు ఉన్నాయి. అన్నింటిమీదా విధిగా "రా. వి. శా." ముద్రి ఉన్నది. డాలరు విలువ ఒక చెంపపడిపోతూ ఉంటే ఈముద్రి విలువ నానాటికీ రీవాల్యూ అవుతూండటం గమనించదగిన విషయం.

కథలను గురించి చెప్పుకునే ముందు "టైటిల్" గురించి ఒక్కముక్క చెప్పాలి. ఇవి "బాకీ" కథలు. ఎవరికి బాకీ? ఏవిధమైన బాకీ? ఈ రచయిత ఆంధ్రిజ్యోతికి బాకీపడి, కథల రూపేణా తీర్చారు. పీఠికలో పురాణంగారు అన్నట్టు ఇలాటి సంప్రదాయం లేకపోలేదు. ఓహెన్రీ ముందు డబ్బు తీసుకుని తరవాత కథలు రాశాడు. (కథకు వెయ్యి డాలర్లని జ్ఞాపకం) దాన్ని బాకీ అనక్కర్లేదు, అడ్వాన్స్ పేమెంట్ అనికూడా అనవచ్చు. చార్లెస్‌డికెన్సును ఒక పుస్తకాలమ్మే ఆయన "నువు వచ్చేనాలుగేళ్ళలో రాసే పుస్తకాలు నాకిచ్చి. నీ రాయల్టీ అడ్వాన్సుగా 28 వేల పౌన్లు పుచ్చుకో" అన్నాట్ట. రా. వి. శా. అమెరికాలో పుట్టలేదు, ఇంగ్లండులో పుట్టలేదు. అందుచేత ఈబాకీ అనే అడ్వాన్సు ఎక్కువ పెద్దమొత్తం అయి ఉండదు.

అయితే ఇంకోరకం బాకీ ఉన్నది. దాన్నిగురించి కూడా పురాణం ప్రస్తావించారుగాని విపులీకరించలేదు. తల్లికీ, తండ్రికీ, గురువుకీ, దేశానికీ ప్రతిమనిషీ రుణపడే ఉంటాడని ఆయన అన్నారు. మేధావికి మరోరుణం కూడా ఉన్నది. తన తలను పొలంగా మార్చి, దున్ని, ఎరువువేసి, పంటను ప్రజలకు పంచటం. ఇది తీర్చవలసిన బాకీ— తల బీడుపడిపోయేదాకా— ఆ తరవాత ప్రపంచం శాశ్వతంగా ఆ మేధావికి బాకీపడి ఉంటుంది. ఈ రెండు బాకీలూ ఒకదాన్నొకటి రద్దుచేసుకోవు. ఇక్కడ గణిత శాస్త్రం పనిచెయ్యదు. ఎందుకంటే ఈ బాకీలను డబ్బుగా మార్చగల షరాబులేదు. కొనేవాడికి ఈ పుస్తకం వెల మూడు రూపాయలు. అందులో రచయిత రాయల్టీ 30 పైసలు అనుకుందాం. కాని, చదివేవాడికీ పన్నెండు కథల విలువ ఎంత? రా.వి.శా. తెలుగు సాహిత్యానికి చేర్చిన విలువ ఎంత? అసలే తేలకపోతే వడ్డీ ఎలాకట్టటం ఇదే మూడు రూపాయలతో మద్రాసులో ఒక మనిషి ఒక డొక్కు సినిమాచూసి వచ్చి, దాన్ని రెండురోజులపాటు మనసార తిట్టుకోవచ్చు ఆ విషయం పోనివ్వండి.

ఇంక కథలకి వద్దాం. నేను పన్నెండు ఉపనిషత్తులు శ్రద్ధగా (తెలుగులో) చదివాను. వాటిలో చాలా విచిత్రమైన విషయాలున్నాయి. కాని అవి ఆధునికుడికి సరిగా అర్థమూకావు. ఉపయోగపడవు కూడా. అంతకన్న "పిపీలికం" అన్నివిధాలా గొప్పది. ఇందులో అనేక సత్యాలున్నాయి.

తాత్విక సమస్యలలో చిక్కుకున్న ఒక చీమ, పని పాడుచేసుకొని, జ్ఞానం కోసం బయలుదేరి, గురుదక్షిణలు సమర్పించుకుంటూ ఒకవీధి బడిపంతులు దగ్గిర ప్రాథమిక విద్య, మరొక సద్బ్రాహ్మడివద్ద బ్రహ్మవిద్య నేర్చుకుని, తన సమస్యలు తీరకపోగా, ఒక మహర్షినడిగి మోక్షసాధనం తెలుసుకుని, "జన్మరాహిత్యమూ, మోక్షమూ ఎందుకు?" అన్న ప్రశ్నకు సమాధానం తెలుసుకోజాలక, ఎలాగైనా చదువుకున్న చీమగనక తమజాతి విరోధిని ఒంటరిగా ఎదిరించి, ఆ విరోధిద్వారా తాను ఎవరో, తనశ్రమ ఫలితం చివరకు ఎవరికి దక్కుతుందో తెలుసుకుని, తాను నాయకత్వం వహించి, "సోదరులందరికి హితబోధచేసి, ధైర్యం చెప్పి, వారిని వీరులుగా మార్చి.... తిరుగుబాటు చేసేందుకు రంగంలోకి" దూకింది. ఈ తిరుగుబాటు ఫలితంగా చీమల పుట్టలోచేరిన రాక్షసాకారపు పాము నెత్తురు కక్కుకుని చచ్చింది!

బందిపోటులను గురించి పత్రికలలో చదివి వాళ్లను నిర్మూలించలేం. ముఖాముఖీ అయి కలియబడినప్పుడేగాని దోపిడీ నిలిచిపోదు- నిజం! దోచేవాడికీ దోచుకోబడేవాడికీ మధ్య ప్రతిఘటనలేకుండా జీవితం మారదు.

జీవితంలో తప్పుడు చదువులూ, నిరర్థకపు చదువులూ ఎలా ఉంటాయో ఈకథ తేలికగా స్పష్టం చేస్తుంది.

వెన్నెల— పడుచు రక్తాన్ని ఉడుకెత్తించే వెన్నెల; కవులను మత్తెక్కించే వెన్నెల (ఆ మత్తులో వారు ఏమేమో రాస్తారు) అయితే మహాకవిని ఎందుకో బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టింది ఒకనాడు. ఇవాళ మళ్ళీ రా.వి.శా.ని వెన్నెల భయపెడుతున్నది. ఎవరో మిట్టమధ్యాహ్నపు టంధకారాన్ని గురించి రాస్తే ఈ రచయిత పండువెన్నెలలో చీకటి గురించి రాశారు "కన్నతల్లీ వెన్నెలా, లోకమంతా వెన్నెలే, నీ పాలుపొంగిన వెన్నెలే. కాని మాకుమాత్రం దానినిండా టీకలే. పేదనెత్తుటి, వేడినెత్తుటి జీరలే" ఈ జీరలకు సంబంధించిన కవితే ఈకథ. వెనకటికి ఒక కాముకుడు ప్రియురాలులేక చంద్రుణ్ణి, "You are wasting time on me," అని పాడాడు. కాని పేదబ్రతుకులు వెన్నెలలో చీకటి జీరలుకమ్మాయి. అదీ జీవితం!

"పక్కింటి అబ్బాయి"లో నిరంజనుడు మన మధ్యతరగతివాడే, మనందరిలోనూ ఉన్నవాడే. వాడు తనలాంటి దరిద్రులను తనవాళ్లుగా చూడలేడు. వాడి ఆశలు పైకి రావాలనే, కాని ఒంటరిగా, స్వయంకృషితో పైకిరావాలని. తనను బాధించే సమస్యలు అందరికీ పోవాలన్న దృక్పథం వాడిలో ఉండదు. బల్లిలాటి పిల్లాణ్ణిచూసి, పుల్లలాటి ఆడవాళ్ళను చూసి వాడికి కోపం వస్తుందిగాని ఆవేదనకలగదు. "అసలు ఆ పిల్లడు ఏడుపు అరంభించేదాకా (ఆరంభించి తన పరీక్ష చదువుకు భంగం కలిగించేదాకా) ఆ పిల్లడు ఉన్నాడన్న సంగతే మర్చిపోయేడు నిరంజనుడు" అదీ వాడితత్వం. తన పక్కనే దారిద్ర్యమూ, దైన్యమూ, అనారోగ్యమూ, అసహాయతా ఉన్నా వాడికి చీమ కుట్టినట్టుండదు. నోరుచేసుకు అడిగినా వాళ్లకి ఓ రిక్షా తెచ్చిపెట్టడు. "మీతో నాకు సంబంధంలేదు" అంటాడు. తాను పరీక్షకు చదువుకునేటందుకు అడ్డంతొలిగితే వాళ్ళ గతి ఏమైందనికూడా వాడు ఆలోచించడు.

నిరంజనుడికి తగిన ఉద్యోగమే దొరికింది— ప్రజలపై పన్నులువిధించే ప్రభుత్వ ప్రత్యేకశాఖలో ప్రధానోద్యోగి పని!

దీనుల జీవితాలను చిత్రిస్తూ రా. వి. శా. రచించిన అనేక కథలలో "బుద్బుదం" ఒకటి. నీటిలో పుట్టిన బుడగనీటిలోనే లయమవుతుంది; జీవితం బుద్బుదం లాటిది; చావు బతుకులు మిధ్య. నిజమే, కాని మనిషికి చావు బతుకుల మధ్య ఉన్నదే నిజం దాని అవతల ఉన్నది మిధ్య. అదీగాక, "నీటి బుడగ పోయినపుడు నీటిబుడగ లేదు స్తాయోలేదో ... కాని, మనిషిపోతే మాత్రం మనుష్యులేడుస్తారు" మనుషులు జీవించటమేకాదు, ఒకరి జీవితాన్ని ఒకరు పంచుకుంటారు- ఇది మరోనిజం.

పెట్టుబడిదారీ సమాజంలో మనుషులుకూడా విక్రియ వస్తువులే. వెయ్యి రూపాయల ఫీడర్లుంటారు, పేదాపరక ఫీడర్లుంటారు. అలాగే డాక్టర్లూనూ. అయితే వీరివల్ల సహాయం పొందవలసిన వాళ్ళూ, పొందలేకపోయేవాళ్లూ మాత్రమే మానవులు. తమ ఖరీదు ముట్టనప్పుడు చావనున్నవాళ్ళను కాపాడకపోవటం వాళ్ళకు "తప్పు" కాదు. కాని నరసయ్యలాటి "మనుషులకు" చావు బతుకుల్లో ఉన్నవాళ్ళను– వాళ్ల వెల చీటీలు అంటించుకున్న విక్రియ వస్తువులే అయినాసరే– తనకు కాపాడేశక్తి ఉన్నప్పుడు కాపాడకపోవటం "తప్పు" అనే అనిపిస్తుంది. అతను "మనిషి" కనక! ఇదే "తప్పు" కథ.

"జాతక కథ" హాస్యకథ. ఆరోనెల్లో చచ్చిపోయిన వాడి జాతకంచూసి ఓ దైవజ్ఞుడు, ఆ జాతకుడు వెయ్యేళ్ల రాయిలాగా బతుకుతాడని చెబుతాడు– చాలు!

వ్యాపారం చేసుకునేవాడు కూలీలకు అచ్చంగా పచ్చిమంచినీళ్ళే పోస్తే హెచ్చు లాభమేవస్తుంది. కాని కూలీలు చచ్చిపోయి నష్టం కొద్దిగా రావచ్చు. అందుచేత వ్యాపారం "సోషలిజం" అవలంభించాలి. అది ఎలాగా? "వారిని మనము కొనవూపిరితో వుంచవలెను.... మనిషికి ఇంత ఎండుగడ్డీ, ఇంత (ఉప్పుబెద్ద కలిపిన) మంచినీరూ అని నిర్ణయించి, వారు చావకుండా చూచుకొనండి". ఈ దివ్యమైన సందేశం "పాతదే కథ"లో ఉన్నది. ఈ సోషలిజం వ్యాపారుల నుంచిగాక భూకామందుల నుంచి వచ్చినట్టు ఈకథ చెబుతున్నది.

"క్రియాసిద్ధిస్సత్త్వే భవతిమహతాం, నోపకరణే" అన్నది మనకు చాలా కాలంగా తెలుసు. అయినా మావో అణుబాంబును కాగితపు పులి అన్నందుకు మనవాళ్లు చాలామంది ముక్కుమీద వేలేసుకున్నారు. పై సమస్యను నలుగురు పూరించినట్టు కథ. అందులో ఒక మహాత్ముడు రాముడు అతను కోతులనూ, కొండముచ్చులనూ వెంటబెట్టుకుపోయి, మహాబలసంపన్నుడైన రావణుడి ఉక్కుకోటలను ఛేదించాడు. ఆ ప్రయత్నంలో ఉన్న రాముడికి ఒక బెదురుగొడ్డు పోయు యత్నించిన పిరికిమందు, "బెదురు" అన్న కథగా రూపొందింది. ఈ కథను ఈనాటి పరిస్థితులకూ ప్రజా విప్లవానికీ ఎలా అన్వయించుకోవాలో ఎవరైనా తెలుసుకోవచ్చు.

"షోకుపిల్లి" ఉన్నత కుటుంబ జీవితాన్ని చిత్రిస్తూనే వేటాకారం చేసే రచన, ఒక ఘరానా కుటుంబం వాళ్లు పెంచుకునే పిల్లికి "అహింస పిల్లి, వెజిటేరియన్ పిల్లి, సోషలిస్టు పిల్లి" అన్న ఆపఖ్యాతి రావటం పెద్దక్రైసిస్! కాని జంతువులు తమ జాతి లక్షణాలను ఎప్పటికైనా ప్రదర్శిస్తాయి. "షోకుపిల్లి" పిట్టను పట్టేస్తుంది. అప్పుడు ఘరానా ఇంటిపెద్ద చెబుతాడు: "అఫ్ కోర్స్, ఆ పిట్టన్చూసి మనం విచారించాలను

కోండి!.... పూర్ బర్డ్!.... ఏ జీవికి ఆ ఆహారం భగవంతుడే ఏర్పాటుచేసేడు. మనం దానికి అడ్డుపడకూడదు. మనతిండికి ఎవరైనా అడ్డుపడితే మనం ఊరుకుంటావా?....

"ఈ మాటలన్నాక ఆయనెందుకోగాని చిరాకుపడ్డారు—" ఈమాట తిండిలేని మనుషులకూ వర్తిస్తుందనికాదు; తమకూ జంతువుకీ సామ్యం తెచ్చుకున్నందుకు!

"వేతనశర్మ"ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చవుతూనే సంచలనం కలిగించిన కథ. వేతనశర్మ కలకాలం ప్రజలనోళ్లలో నానగలడు." ప్రభుత్వోద్యోగులకి వేతన శర్మే మొట్టమొదటి పీఠాధిపతి. ఆ తరువాత వేతనశర్మలే కార్మికనాయకులుగా కూడా రూపొందడంతో ప్రభువులంతా సకలధన కనక వస్తు వాహనాలతో తులతూగుతు ప్రశాంతంగా జీవించుతూ వాస్తున్నారు. ఎక్కువ జీతాలకోసం సమ్మెలేతప్ప, సమసమాజం కోసం విప్లవాలు వద్దంటారు ప్రభువులు, అవునంటారు ప్రభుత్వోద్యోగులు (ఉరఫ్ వేతనశర్మలు.)

ప్రభువులకు లాభించే ఏ గొప్ప సత్యాన్ని వేతనశర్మ ప్రవచించాడు?

"సమాజం పూర్తిగా మారితేనేగాని జీవితాలు బాగుపడనివాళ్లు.... విప్లవాలు తెస్తారు. చావుకి తెగిస్తారు. మనం ఆ కోవకి చెందుతామా? చెందం! సమాజం ఇలానే ఉన్నప్పటికి మనకు బాగుపడే అవకాశాలున్నాయి..... మనకు వేతనాలు పెరిగితే రాజులూ మారనవసరం లేదు. రాజ్యాంగమూ మారనవసరం లేదు,.... రాజవర్గానికి చావా బతుకా అని ఉన్నట్టి ఈ విప్లవసమయంలో మనం రాజవర్గానికి స్పష్టంగా, 'మాకు వేతనాలతోనే సంబంధం ఉంది. కాని విప్లవాలతో సంబంధం లేదు' అని చెప్పినట్లయితే వారు చాలా సంతోషించి మనకి మరో....పిడికెడైనా ఇచ్చి తీరుతారని నాకు ఎంతో నమ్మకం ఉంది." అని వేతనశర్మ తనతోటి కరణాలతో చెబుతాడు.

"ద్వైతాద్వైతం"ఒక రకం భావచిత్రణ. అందులో రెండుభాగాలు. మొదటిదాన్ని అరణ్యంలో దేవుడు, రెండోదాన్ని నగరంలో దేవుడూ అనవచ్చు. తనస్వశక్తిలో విశ్వాసంగల పులి తనశక్తులేవీ తనను కాపాడలేని పరిస్థితిలో దేవుడి యందు విశ్వాసం ఉంచి, తనకు మేలు జరిగాక ఆ దేవుణ్ణి బల పరుస్తూ ప్రచారం చేస్తుంది. రెండో భాగంలో ఒక ఆడ మేకపిల్ల సంఘం యొక్క పరిభావంవల్ల దైవభక్తి అలవరచుకుని, ఆపత్సమయంలో భగవంతుణ్ణి ప్రార్థించి కూడా పులివాతపడి పోతుంది. ఆలా చచ్చిపోకుండా తప్పించుకు పోయిన దాని అన్న మేక భగవంతుడి రక్షణమ ఎంత మాత్రమూ నమ్మదు. "భగవంతుడుంటాడు," అని (ఎందుకో!) ఒప్పుకుంటుంది. "కాని, అతను మనకి మన కోసం మనయెడల మన మంచికి ఉండడుండడు, ఉండడు కాక ఉండడు." అంటుంది.

"రవ్వ" అనేది చాలా చిన్నకథ. అయితే దాని వెనుక ఉన్న చరిత్ర చాలా పెద్దది. ఇదే విషయం తీసుకుని బెంగాలీలో తారాశంకర్ బెనర్జీ పెద్దనవల రాశాడు. నిరుపేదలు కొండలమధ్యా, అరణ్యాలలోనూ, పాములూ, జెర్రిలూ నివసించే ప్రాంతాలలోనూ చెమటోడ్చి నేల బాగుచేసి వ్యవసాయక్షేత్రాలు ఏర్పాటు చేస్తారు. తరవాత కామందులూ, జమీందార్లు వచ్చి వంచన చేసో, దొంగపత్రాలు సృష్టించో వాటిని కాజేస్తారు. చెమటోడ్చిన వాళ్ల కడుపు మండి ఎదిరిస్తే చట్ట బద్ధంగా వారి చేతరక్తం కూడా కార్పిస్తుంది. అలాటి తిరుగుబాట్లకు నగ్జల్బరీ అన్న తిట్టుపేరూ, అలాంటి ప్రభుత్వాలకు పోషలిస్టుకితాబూ రావటం కద్దు.

ఇదీ కథల వైనం. రా.వి. శాస్త్రి ఈదేశపు ఈకాలపు మేధావివర్గం చేత బ్రహ్మరథం పట్టించుకోగల రచయిత. అయిన కథలు చదివినాక చదువక ముందున్నస్థితిలోనే ఉండగలవాడు పరమజడుడై ఉండాలి. ఆయనలో ప్రచారగుణం ఉన్నది. పాఠకుణ్ణి కాలరు పట్టుకు విలిపేసే లక్షణం ఉన్నది. శిల్పవైవిధ్యం ఉన్నది. నూతన ప్రయోగాలు చేసే సమర్థత ఉన్నది. అలాంటి రచయిత విప్లవసాహిత్యం తరుపున నిలబడటం విప్లవ సాహిత్యోద్యమానికి అంచనా కట్టవీలు లేనంత ఉపకారం. ఈపుస్తకంలోని కథలు అన్నీ కాకపోయినా కొన్ని అయినా విప్లవసాహిత్యానికి ఆభరణాలు. మధ్య తరగతి పునాదులు కదిలించటానికి అందులోని ప్రతి కథా ఉపయోగపడుతుంది. ఇలాంటి "డైనమైట్" రా. వి. శాస్త్రి సృష్టించి నంతగా మరే వర్తమాన రచయితా సృష్టించలేదని చెప్పాలి.

—కొడవటిగంటి కుటుంబరావు

పెట్టుబడి

"...పనివాళ్ళే మంటారంటే యిండస్ట్రీలో మేజర్‌పార్టు తమదే నంటారు. డబ్బు వస్తువులను పుట్టించదుకదా! గనిలో అయినా కార్ఖానాలో అయినా వస్తూత్పత్తికి పనివాళ్లే కారకులు. వస్తువుతెచ్చిన డబ్బులో 'కూలి' అని కొంత పుచ్చుకొని 'లాభం' అని కొంత పోగొట్టుకుంటున్నారు. అలా పోగొట్టుకున్నలాభాలే పోగుపడి ఈనాడు పెట్టుబళ్లైనాయి. తమపేర్న నమోదు కాకున్నా నిజానికి ఆ ఆస్తి తమదే అంటారు."

— కాళీపట్నం రామారావు

సాహిత్య లేఖలు :

మావో సూక్తులు

కలకత్తా పోలీసు డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ ఇటీవల మావోసూక్తులు పదిహేను వందల కాపీలు స్వాధీనం చేసుకుంది. గత సంవత్సరం గుజరాత్ ప్రభుత్వం మావో సూక్తులను నిషేధించినపుడు ప్రధాన న్యాయమూర్తితో కూడిన గుజరాత్ హైకోర్టు స్పెషల్ బెంచి ఈవిధంగా తీర్పిచ్చింది.

"ప్రజలకు యే సిద్ధాంతం యే జీవనవిధానం మంచిదో నిర్ణయించే బాధ్యత ఈనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వానిదిగాని, జడ్జీలదికాని కాదు. ప్రజలు తమకవ సరమైందెన్నుకొని వివేకంతో, తెలివితో తమ కుపకరించేదెన్నుకోటానికి ఆలోచనను, స్వచ్ఛందంగా ప్రచారం కానివ్వడం చాల ముఖ్యమైన అవసరం. పరిజలోకవేళ మావో చెప్పిన కమ్యూనిస్టు తత్వాన్ని అనుసరించ దల్చుకుంటే ఈ పుస్తకాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు వారినలా చెయ్యకుండా ఆపలేవు".

నేనీమాటలు మన న్యాయస్థానాలను గొప్ప జేయడానికి చెప్పటంలేదు. కాని ప్రభుత్వం నెత్తిన నోరుబెట్టుకొని 'యే కమిటెడ్ జుడీషియరీ' కావాలని కోరుతున్నదో ఆ అవసరాన్ని ఈ మాటలు నిరూపిస్తున్నాయి.

ఎ. సిరాజ్
కలకత్తా

* * *

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే 'మేంటినెన్స్ ఆఫ్ పబ్లిక్ ఆర్డర్ యాక్ట్' శ్రమజీవులకు వ్యతిరేకంగా ఉపయోగించమని చెప్పారు. కాని ఈచట్టం మావోసూక్తులు ప్రచురించిన వాళ్లను, కలిగివున్న వాళ్ళను అరెస్టుచేయడానికి ఉపయోగించబడ్డది. పై ప్రకటన ఈ అరెస్టువార్త రెండూ పత్రికల్లో ఒకేరోజు వచ్చాయి.

ఎస్. మిత్రి
కలకత్తా

డాగ్మాటిక్ విమర్శ

ఎర్. లిబర్డ్‌గారు 'అతకని బ్రతుకులు'పై చేసింది డాగ్మాటిక్ విమర్శ.

శేఖరం చదువుకొన్న విద్యార్థి. విప్లవ మనస్తత్వంవున్న ప్రతివిద్యార్థీ మొదట తన యింట్లో ఖండించేవి శేఖరం ఖండించినవే. అంటే దీన్నిబట్టి 'వారు' పసివాడంటున్న సంపత్‌రావుగారి 'శేఖరం'— అడుగడుగునా మానసిక విప్లవస్థితి చూపించాడు; లిబర్డ్‌గారికివి అనుభవానికి దూరంగా ఉండివుండాలి.

తరానికి— తరానికి అంతరం, అందునా విప్లవకారుడికి— ఈ అంతరం చివరికి తను నివసిస్తున్న తనతోటి భావవాదుల మధ్దినవుండే సహించలేని— ఈ వైరుధ్యాలపై కసిపెంచుకోటం— లేదా కోపగించుకోటం అతని మానసికస్థితిని మరింత ముందుకు నెడ్తుంది.

ఒక పదహారణాల యువకుడు తనయింట్లో— సమాజంలో జరిగిన పోరాటంలో. రాజీచేసికోలేని పరిస్థితుల్లో గతాన్ని నెమరేసుకుంటూ, తనకు కల్గిన కసి— అజ్ఞానం; మొదట 'కష్' తనచావు ద్వారా తీర్చుకోవచ్చుననే దురభిప్రాయంలోపడి— ఆలోచనా క్రమంలో— జ్ఞానానికీ— అజ్ఞానానికీ— కల్గిన వైరుధ్య పోరాటంలో, నెగ్గి— దీనికంతటికీ మూలం ఏమిటో గ్రహించబట్టే ఇంట్లోంచి అటవిక జాతిలోకిపోవటం— ఈకథయొక్క మౌలికమైన అభిప్రాయమని ఎవరు చదివినా అర్థంచేసుకుంటారు,

అటవికజాతిని జాగృతపరచటంలో— తనజ్ఞానాన్ని ఆ యువకుడు వుపయోగించుతున్నాడని రచయిత భావంగానీ— లిబర్డ్‌గారు వక్రభాష్యం చేసినట్లు— నీచాభిప్రాయం రచయిత భావం అని చదివేవారికి తోస్తుందనుకోను, ఎనలైజ్ చేసేటప్పుడు— లేని అర్థాలులాగి తమ కు వి మ ర్శ చాటుకోటం తప్ప మరేమీకాదు. అందుకే మావో అభిప్రాయపడినట్లు—

"విమర్శ పూర్తిగా హేతువుతో, విశ్లేషణతో కూడి, ఎదుటివాణ్ణి అంగీకరింపజేసేదిగా వుండాలి. అంతేగాని, దురుసుగా బ్యూరాక్రటిక్‌గా, మెట్టవేదాంత వాదంగా, పిడివాదంగా ఎప్పుడూ ఉండకూడదు".

సాగర్
ఒంగోలు

కుట్ర ? (!)

సృజన సంపాదకులకు

మహాశయా—

సృజన మార్చి'72 సంచికలో పునః ప్రచురించిన 'అతకని బ్రతుకులు' కథ శ్రీ సంపత్‌రావుగారు 1963లో అనగా సరిగా తొమ్మిదేళ్ళక్రితం వ్రాసినటువంటిది,

కుట్రి ? (1)

మనిషికీ మనిషికీ మధ్య సామరస్యం కుదరనీయని గత్యంతరం లేని జీవన విధానాల లో మంచికీ చెడుకూ భేదం తెలియనీయని సందిగ్ధ పరిస్థితిలో ఊపిరాడక దిక్కుతోచక అతలాకుతలం కావటాన్ని సాధించటమే ఈవ్యవస్థ యొక్క ఆశయం. దాన్ని ఛేదించటానికి సాయుధ విప్లవమొక్కటే శరణ్యమని తేల్చుకోక ముందు సాంస్కృతిక విప్లవము, భావవిప్లవము ఆశయంగా వున్నదశలో యింకా శ్రీ కాకుళగిరిజనోద్యమానికి యిప్పటి చారిత్రిక దశ ఏర్పడక ముందు సంపత్ రావు చెప్పిన కథలోని శేఖర్ వుండినాడు. శ్రీ ఎర్. లిబర్ట్ గారు (సృజన-మే 72) అనుకున్నట్లు ఆకథ శ్రీకాకుళగిరిజనోద్యమానికి సమకాలీనమైనదికాదు. కనుకనే ఆ కథను విప్లవాన్ని అపహాస్యం చేసేటందుకుగానీ, విప్లవకర వర్గాలను అయోమయంలో పడవేసేటందుకుగానీ ధ్యేయంగా సృష్టించబడలేదనవచ్చును. ఆ కథారచన కాలానికి దేశంలోని యువకుల చైతన్యాన్ని నిలవేసే ప్రతి బంధకాలు ఎట్లు ఏర్పడుతున్నాయో, ఏలికలు అల్లిన కుతంత్రాల మూలంగా ఏర్పడిన కుసంస్కారం ఎంత బలవంతరంగా వేళ్ళుతన్నుకుని వున్నదో దాన్ని పెకల్చివేయటాన్ని ధ్యేయంగా పెట్టుకున్న శేఖర్ లాంటి యువకులు ఎట్లు నిర్వీర్యులయిపోతున్నారో చూచి సంపత్ రావు ఆరాటపడినట్లున్నది. ఉల్లాసంగా కాలాన్ని దిగమ్రింగడమే జీవితపరమావధిగా వుంటున్న యువకులకు భిన్నంగా "సమాజంలో మార్పు నవ వసంతం లాంటింది. నిశ్చింతగా బ్రతకడమంత క్షుద్రమైనది మరోటి లేదు. ముళ్ళబాటలో పయనించాలి. ఆత్మవేదనలో అభిప్రాయాలను శుభ్రపరుచుకోవాలి. ప్రయోజనం కోసం ఎంతటి త్యాగమైన చేయటానికి సిద్ధంగా వుండాలి. అప్పుడే జీవితానికి సార్థకత" అనుకునే శేఖరం పరిస్థితుల విషవలయంలో చిక్కుకుని సతమతమైపోతాడు. శేఖర్ అసహ్యించుకున్నది తల్లి, తండ్రి, భార్య, యిత్యాది సంబంధాల్ని కాదు. శేఖర్‌తో ఆ సంబంధాలు కల్గియున్న మనుషులు హీన సంస్కారానికి ప్రాతినిధ్యం వహించిన పాపతైనందుకు అసహ్యించుకున్నాడు. (దశ దశలుగా ఉత్సాహాన్ని అర్చుకుంటూ దిగజారిన శేఖర్ పరిస్థితులదృష్ట్యా సందర్భానుగుణమైన, పాత్రాను గుణమైన శేఖర్ భావాల్ని రచయిత కంటగట్టవలసి వుండదు) భిన్నసంస్కారాల మధ్య తలెత్తే శతృవైరుధ్యం వ్యక్తిని చిత్రహింసకు గురిచేస్తుంది, అప్పుడు అంతకన్న తక్కువ బాధాకరమైన చావుని కోరేటటువంటి దశలో శేఖర్ ఆత్మహత్య చేసుకోవాలని ఆవేశపడతాడు, అయితే జీవితం మీది ఆశవల్ల ఆత్మజాగృతి కల్గుతుంది, పైపూతలతో పాత వ్యవస్థను మాడర్నైజ్ చేయటానికి ప్రయత్నించే కన్న యింకా కలుషితం కాని మనుషులయిన ఆటవికుల్లోంచి క్రొత్త సంస్కారాన్ని ప్రభవింపజేయటానికి శేఖర్ ఆటవిక జాతిని జాగృతపరిచే కార్యక్రమాలకు పూనుకుంటాడు. అయితే ఈ ఆటవికులు శ్రీకాకుళం గిరిజనులవిగానీ, ఆకార్యక్రిమాలకు పూనుకోడం అంటే అతి నికృష్టమైన చావని గానీ ధ్వనించాలన్న ఉద్దేశం లేదు.

ఎర్. లిబర్ట్ గారి బాధని ప్రస్తుతపరిస్థితిలో తనంత బాగా అర్థంచేసుకున్నందుకు ఆవిమర్శని శావ్యమైనదిగానే అంగీకరించ వచ్చును. అయితే విప్లవానికి అనుకూలమైన ది కాక పోయినా రచయిత ప్రచురించమని అడగకుండానే పత్రికలో వేయటం చూస్తే సృజన నిర్వాహకులూ విమర్శకుడూ కప్పికట్టుగా సంపత్‌రావుని ఎద్దేవాచేయటానికి ఏదో అక్కసుతో కుట్రపన్నినట్లుగా వున్నది

—చార్వాక!

['అతకని బ్రతుకులు' కథ విషయంలో నేను చేసిన తప్పు ఫలితం రచయిత అనుభవించాల్సి వచ్చినందుకు చాల చింతిస్తున్నాను. పై లేఖలో చెప్పినట్లు అది తొమ్మిది సంవత్సరాల క్రితం 'గడ్డిపూలు' అనేకథా సంకలనంలో వెలువడింది. 'గడ్డిపూలు' ప్రయోజనకరమైన కథా సంకలనం. మళ్ళీ ఒకసారి ఆ కథా సంకలనాన్ని సృజన పాఠకుల దృష్టికి తేవాలన్నదే నా అభిప్రాయం. కాని యీ విషయంలో రచయితనుగాని, సంకలనకర్తనుగాని సంప్రదించకపోవడం 'గడ్డిపూలు' సౌజన్యంతో అని వేయకపోవడం నాతప్పే. అందుకు రచయితను, సంకలన, ప్రచురణకర్తలను క్షమించమని కోరుతున్నాను. ఇక కథావస్తువు విషయంలో నేను ఎర్. లిబర్ట్ గారితో ఏ మాత్రం ఏకీభవించడం లేదు. పై ఒక లేఖలో (సాగర్) పేర్కొన్నట్లు అది డాగ్మాటిక్ విమర్శ. రచయిత అనుమతి లేకుండా యీకథ ప్రచురించడం జరిగింది గనుక యింక రచయితకు తప్ప ఎవరికీ యీ విషయంపై రాయడానికి అవకాశం వుండదని గ్రహించ ప్రార్థన]

—సంపాదకుడు

జంటనగరాలలో పోలీసు దాడులు

విరసం ప్రధాన కార్యదర్శి ఖండన

తమ సభ్యుల గృహాలపై పోలీసులు అర్ధరాత్రిసమయంలో దాడులు జరిపి, అమాయకులైన వ్యక్తులను డిటెన్షన్‌లో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ విప్లవ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ చెరబండరాజు, శ్రీయుతులు నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, ఎం.టి. ఖాన్ ఒక సంయుక్త ప్రకటన చేశారు.

పౌరహక్కుల పరిరక్షణకై పోలీసుల దమననీతిని వ్యతిరేకించవలసిందని, ప్రజాస్వామ్యంలో విశ్వాసంగల ప్రజలకు వారు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సెర్చి వారంటు లేకుండానే పోలీసులు పెక్కుపుస్తకాలను, వ్యక్తిగత లేఖలను స్వాధీనం చేసుకున్నారని వారు ఆరోపించారు. విప్లవ రచయితల సంఘంలోని ఒక సభ్యుని బావమరిది. అతనికి సంఘంతో ఎటువంటి సంబంధం లేకపోయినా పోలీసులు నిర్బంధంలోనికి తీసుకొని, తరువాత విడుదలచేశారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హైదరాబాద్, మే 12

అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా మన జాతీయ విమోచన పోరాటం ఎన్నో కష్టాలను, త్యాగాలను సహించాల్సి రావచ్చు. కాని మనకు సంపూర్ణ విజయం కలిగి తీరుతుంది.

ఇది తథ్యం.

అమెరికా దురాక్రమణలకు వ్యతిరేకంగా మన పోరాటాలు చాల దీర్ఘకాలంగా సాగవచ్చు. మన ప్రజలు జీవితాలను, ఆస్తులను పోగొట్టుకోవలసి రావచ్చు. ఏమైనాకాని, సంపూర్ణ విజయం లభించే దాకా అమెరికా దురాక్రమణదారులను ఎదురిస్తామన్న మన సంకల్పాన్ని గాఢంగా కాపాడుకోవాలి.

ముందు ముందు ఎన్ని కష్టాలు, ఎన్ని కడగండ్లయినా రానీ మన ప్రజలకు సంపూర్ణ విజయం లభిస్తుందన్న విశ్వాసం ఉన్నది. అమెరికా సామ్రాజ్యవాదులు వెళ్ళిపోక తప్పదు. మన పితృదేశం మళ్లీ ఏకమై తీరుతుంది.

ఉత్తర, దక్షిణాల్లోవున్న మన సహచరులందరూ తిరిగి ఏకమై ఒకే కప్పుకిందికి వస్తారు. ఒక చిన్న దేశం ఒక వీరోచితమైన పోరాటంలో రెండు పెద్ద సామ్రాజ్యవాద శక్తులను– ఫ్రెంచ్, అమెరికన్ శక్తులను– ఓడించిందన్న అపూర్వమైన గౌరవాన్ని మనదేశం పొందుతుంది. జాతీయ విముక్తి పోరాటాలకు మనదొక అర్హమైన, ఆదర్శమైన కానుకగా నిలిచిపోతుంది.

నా అంతిమ ఆకాంక్ష ఏమిటంటే మనమొత్తం పార్టీ, ప్రజలూ, ఒకరి కృషికి ఒకరు చేదోడు వాదోడుగా ఒక శాంతియుత, పునరేకీకృత, స్వతంత్ర, ప్రజాస్వామ్య, సుభిక్షమైన వియత్నామ్‌ను నిర్మించి ప్రపంచ విప్లవానికి అర్హమైన దోహదంగా తీర్చిదిద్దాలని.

మన పర్వతాలు ఎప్పటికీ వుంటాయి, మననదులు ఎప్పటికీవుంటాయి.
మన ప్రజలు ఎల్లప్పుడూ వుంటారు.
అమెరికా దురాక్రమణదారులను ఓడించి
మనం మనదేశాన్ని ఇంకా పదిరెట్లు అందంగా
కొత్తగా నిర్మించుకుందాం.

హోచిమిన్ వీలునామా. (10 మే 1969) నుంచి